# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 08 సంచిక :275 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 04-01-2024 | పేజీలు:4 వెల: 2.00


## ఇజ్రాయెల్ దాడిలో హమాస్ అగ్ర నేత అరౌరీ మృతి

బీరుట్, జనవరి 3ః లెబనాన్ రాజధాని బీరుట్ శివారు ప్రాంతంలో ఇజ్రాయెల్ జరిపిన డ్రోన్ దాడిలో హమాస్ అగ్ర నేత, మిలిటెంట్ విభాగం వ్యవస్థాపకుల్లో ఒకడైన సలేహ్ అరౌరీ మృతి చెందాడు. డ్రోన్ దాడితో చోటుచేసుకున్న పేలుడులో ఆరుగురు మృతి చెందినట్లు లెబనాన్ అధికార వార్తా సంస్థ వెల్లడించింది. అందులో అరౌరీ ఉన్నట్లు తెలిపింది. అయితే ఈ ఘటనపై స్పందించేం దుకు ఇజ్రాయెల్ నిరాకరించింది. హెజ్‌బొల్లాకు గట్టి పట్టున్న ప్రాంతమైన దక్షిణ బీరుట్ శివారులో ఈ ఘటన జరగడం కలకలం రేపింది. అరౌరీ హత్య నేపథ్యంలో యుద్ధం మరింత తీవ్రమయ్యే అవకాశముందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఘటనపై లెబనాన్ ఆపద్ధర్మ ప్రధాని నజీబ్ మికాతీ ఒక ప్రకటన విడుదల చేశారు.

## మెట్రోరైలు విస్తరణపై స్పష్టత ఇచ్చిన రేవంత్ సర్కార్



హైదరాబాద్, జనవరి 3: హైదరాబాద్ నగరంలో మెట్రోరైలు విస్తరణపై కొత్త ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. గతం లో ప్రతిపాదించిన కొన్నింటిని నిలిపేస్తూ.. మరికొన్నింటిని కొనసాగిస్తూ.. కొత్తగా కొన్ని మార్గాల్లో పొడిగించాలని నిర్ణయించింది. ఎక్కువ ప్రాంతాలను కలిపేలా మార్గాలను నిర్దేశిం చింది. ఐదు మార్గాలలో 76 కి.మీ. మేర మెట్రో విస్తరణ తమ ప్రాధాన్యమని స్పష్టం చేసింది. ఐటీ కారిడార్‌కు ఇప్పటివరకు సరైన ప్రజారవాణా లేదు. రాయదుర్గం వరకే మెట్రో ఉంది. దీంతో ఇక్కడి నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ చేరుకోవడానికి ఉదయం గంటన్నరపాటు ట్రాఫిక్‌లో నరకంగా ఉంటోంది. కొత్తగా విస్తరించే మార్గాల్లో రాయదుర్గం నుంచి గచ్చిబౌలి, విప్రో, అమెరికన్ కాన్సులేట్, ÷నాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు 12 కి.మీ. నిర్మించనున్నారు. దీంతో ట్రాఫిక్ కష్టాల నుంచి ఊరట లభి స్తుంది. మరోవైపు ఎక్కువ మంది ప్రయోజనం కల్గించే మార్గాలపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించిం ది. జాతీయ రహదారి కూడలిలో..: బెంగళూరు జాతీయ రహదారి సిటీలోకి ప్రవేశించే ఆరాంఘర్ వద్ద నిత్యం ఎంతో రద్దీగా ఉంటుంది. దూర ప్రాంత బస్సుల కోసం ఇక్కడే ఎక్కువ మంది ఎదురు చూస్తుంటారు. ఈ ప్రాంతానికి మెట్రో అనుసంధానం లేకపోవడంతో సిటీకి చేరుకోవడానికి ట్రాఫిక్‌లో ఎక్కువ సమయం పడుతోంది. నాగోల్ నుంచి ఎల్బీనగర్, ఎల్బీనగర్ నుంచి చంద్రాయణగుట్ట జంక్షన్, అక్కడి నుంచి ఆరాంఘర్ వరకు మెట్రోని విస్తరించాలని నిర్ణయించి అధ్యయనం చేయాల ని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. 19 కి.మీ. ఉండే ఈ మార్గం కొత్త హైకోర్టు నిర్మించే ప్రాంతాన్ని కూడా కలుపుతుంది.

## పేదలందరికీ సంక్షేమ పథకాలు..

జూలపల్లి: పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకే ప్రజా పాలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలియజేశారు. బుధవారం పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలంలోని కుమ్మరి కుంట గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ%ాా% కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీల అమలు పట్ల చిత్తశుద్ధితో ఉన్నామని, ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకం అందించడమే తమ లక్ష్యమన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డ రెండు రోజుల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఆరోగ్యశ్రీ 5లక్షల నుండి 10లక్షల రూపాయలకు పెంపు, మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం రెండు హామీలను నెరవేర్చామని, అలాగే అధికారులంతా ఇది తమ ప్రభుత్వం పేదల ప్రభుత్వమనే ఆలోచనతో పనిచేయాలని తెలిపారు.అలాగే రేషన్ కార్డు లేని వారు అభయహస్తం గ్యారంటీ దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు దరఖాస్తు పత్రాన్ని జత చేసి స్థానికంగా ఉన్న ప్రభుత్వ అధికారులకు ఇవ్వాలన్నారు. ప్రజా పాలనకు వచ్చే ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించి ప్రజల మనసు గెలుచుకోవాలని, పెద్దపల్లి నియోజకవర్గంలో ఉన్న నిరుపేదలందరికీ ఇందిరమ్మ



ఇండ్లు అందించేలా కృషి చేస్తానని, అలాగే పెద్దపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అద్భుతంగా అభివృద్ధి చేసుకుందామని, అలాగే రాజకీయాలు పక్కన పెట్టి ప్రజా సేవకులుగా మారడానికి నాయకులకు ప్రజాపాలన ఒక మంచి అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీలో బీఆర్ఎస్ ఉన్నట్లా..లేనట్లా?

హైదరాబాద్,ఆంధ్రప్రదేశ్ లో భారత రాష్ట్ర సమితి ఏం చేస్తోంది? అసలు ఆ పార్టీ రాష్ట్ర శాఖ ఉన్నట్లా? లేనట్లా? గతంలో టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చేసి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి జాతీయ రాజకీయాలలోకి దూకేశారు. ఆ సమయంలో ఆయన బాగా దృష్టి పెట్టిన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ముందు పీఠిన ఉంది. ఏపీలో అధికారంలో ఉన్న వైసీపీ అధినేత జగన్ సహకారంతో రాష్ట్రంలో కొన్ని పార్లమెంటు స్థానాలను బీఆర్ఎస్ ఖాతాలో వేసుకోవచ్చన్న భావన గట్టిగా వ్యక్తమయ్యేది. అలాగే బీఆర్ఎస్ సహకారంతో మరోసారి ఏపీలో జగన్ ను అధికారంలోకి వచ్చేలా చేయొచ్చన్నదీ ఆయన వ్యూహంగా పరిశీలకులు అప్పట్లో పలు విశ్లేషణలు చేశారు.అయితే అదంతా గతం.. కేసీఆర్ జాతీయ రాజకీయ ఆకాంక్షలకు పురిట్లోనే సంధి కొట్టినట్లుగా తెలంగాణలో పరాజయం ఎదురైంది. అయినా ఆయన దేశమంతా కాళ్లకు బలపాలు కట్టుకుని తిరిగినా దరి చేరిన వారు కానీ దగ్గరకు రానిచ్చిన వారు కానీ కనిపించలేదు. తెలంగాణలో పరాజయం పాలైన బీఆర్ఎస్ ఇప్పుడు జాతీయ స్థాయిలో తన సత్తా చాటడానికి ముందుకు వస్తుందా..? ఒక వేళ వచ్చినా ఎక్కడైనా కనీసం ఉనికి చాటుకోగలుగుతుందా అంటే అదీ అనుమానమే. ముఖ్యంగా ఏపీ రాజకీయాలలో బీఆర్ఎస్ పరిస్థితి పబ్బలో పుట్టి మఖలో మాడిపోయిన చందమేనని అంటున్నారు.2019 ఏపీ ఎన్నికలలో పరోక్షంగా పాల్గొని జగన్ విజయానికి తన వంతు పాత్ర పోషించి టీడీపీ పార్టీకి, బాబుకి రిటర్న్ గిఫ్ట్ ఇచ్చిన కేసీఆర్ ఇప్పుడు తమ పార్టీకి రేవంత్ ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ షాక్ లో ఉన్నారు. ఇటువంటి పరిస్థితులలో కేసీఆర్ తిరిగి ఏపీ రాజకీయాల వైపు దృష్టి పెడతారా అంటే అనుమానమే అంటున్నారు పరిశీలకులు. ఏపీలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసి తోట చంద్రశేఖర్ ను ఏపీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించిన కేసీఆర్ ఏపీ ఎన్నికల బరిలో దిగుతారా..? లేక గతం మాదిరే తమ తస్మదీయులకు పరోక్ష మద్దతు ఇస్తారా..? లేక తెలంగాణలో పార్టీ కోల్పోయిన పట్టును తిరిగి నిలబెట్టు కోవడానికి పక్క రాష్ట్రాల వైపు తమ కారు స్టీరింగ్ ను తిప్పకుండా గమ్మునుంటారో..? వేచి చూడాలి. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు జాతీయ పార్టీ భారత రాష్ట్ర సమితి ఏపీలో అసలు ఉందా? ఆ పార్టీ రాష్ట్ర శాఖను ఘనంగా ఏర్పాటు చేసిన తరువాత ఏం జరిగింది? ఏం జరుగుతోంది? అంటే ఎవరి నుంచీ సరైన సమాధానం రావడం లేదు. జాతీయ రాజకీయాలలో చక్రం తిప్పుతానంటూ ఘనంగా బీఆర్ఎస్



పార్టీని ప్రారంభించిన కేసీఆర్ తెలంగాణలో కంటే ముందుగా ఏపీలోనే బీఆర్ఎస్ రాష్ట్ర శాఖను ప్రారంభించారు. పెద్ద ఎత్తున బీఆర్ఎస్ హోర్డింగులతో హడావుడి చేశారు. ఇక ఆ పార్టీలో చేరికలకు ఏపీకి హైదరాబాద్ నుంచి వాహనాలు పంపి మరీ నాయకులను రప్పించుకున్నారు. దారి పొడవునా బీఆర్ఎస్ లోకి స్వాగతం అంటూ హోర్డింగులు, ఫ్లెక్సీలూ ఏర్పాటు చేశారు. ఏపీలో బీఆర్ఎస్ బహిరంగ సభలు నిర్వహిస్తుందనీ, కేసీఆర్ ఆ సభలలో పాల్గొంటారనీ పెద్ద ఎత్తున ప్రచారంతో ఊదరగొట్టేశారు. అంతే ఆ తరువాత ఏపీలో బీఆర్ఎస్ ను పట్టించుకున్న నాథుడే లేడు. ప్రచారార్భాటం వినా ఆ పార్టీ ఏపీ శాఖ చేసిందీ, పీకిందీ ఏమీ లేదు. ఇప్పుడు ఏపీలో బీఆర్ఎస్ ప్రతినిధి ఎవరైనా ఉన్నారంటే ఆయన ఒక్క ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ మాత్రమే. ఆయన కూడా ఉండేది హైదరాబాద్ లోనే. ఆయన వ్యాపారాలూ, భూములూ అక్కడే ఉండటంతో బీఆర్ఎస్ ముచ్చటగా మూడో సారి అధికారంలోకి వస్తుందన్న ఉద్దేశంతో మాత్రమే ఆయన బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.ఇప్పుడు తెలంగాణలోనే బీఆర్ఎస్ పరాజయం పాలు కావడంతో ఇక ఆయన పార్టీలో కొనసాగుతారని కానీ, కొనసాగినా క్రియాశీలంగా ఉంటారని కానీ ఎవరూ భావించడం లేదు. మొత్తంమీద బీఆర్ఎస్ పేరుకే జాతీయ పార్టీ కానీ ఉనికి మాత్రం తెలంగాణకే పరిమితమని , ఇప్పుడు ఆ తెలంగాణలోనే ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో ఉందనీ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## హసీనా తీరు మారేనా!



ఢాకా, జనవరి 3ః పొరుగు దేశం బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమైంది. ఈ నెల 7న ఈ ఎన్నికలు జరగనున్నాయి. కాకపోతే వాటి ఫలితం మాత్రం ముందే తేలిపోయింది. విపక్ష పార్టీల బాయ్‌కాట్ నేపథ్యంలో పాలక అవామీ లీగ్ విజయం, పార్టీ అధినేత్రి షేక్ హసీనా ప్రధానిగా కొనసా గడమూ లాంఛనప్రాయమే కానుంది. హసీనా వంటి నియంత చేతిలో అధికారం ఉన్నంత వరకూ ఎన్నికలు పారదర్శకంగా జరిగే అవకాశం లేదని విపక్షాలన్నీ ఆరోపిస్తున్నాయి. ఆమె పదవి నుంచి తప్పుకుని తటస్థ మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని, దాని పర్యవేక్షణలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరపాలని అవి పలుమార్లు డిమాండ్ చేశాయి. వాటిని హసీనా నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. దాంతో ఎన్నికల బహిష్కరణ తప్ప తమకు మరో మార్గం లేదని విపక్షాలన్నీ ఇప్పటికే ప్రకటించాయి. బేగం ఖలీదా జియా సారథ్యంలోని బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ), దాని భాగస్వాములతో పాటు ప్రధాన ప్రతిపక్ష పార్టీలన్నీ ఎన్నికలను బాయ్‌కాట్ చేశాయి. ఈ నేపథ్యంలో బ్యాలెట్ పత్రాలపై కేవలం అధికార అవామీ లీగ్, దాని భాగస్వామ్య పక్షాల అభ్యర్థులు, స్వతంత్రులు మాత్రమే ఉండనున్నారు. దాంతో హసీనా తీరుపై ఇంటా బయటా విమర్శలు వినిపిస్తున్నాయి. ఆమె పూర్తిగా ఏకపక్ష పోకడలు పోతున్నారన్న ఆరోపణలు ఇప్పటివి కావు. బంగ్లాదేశ్‌లో 2009 నుంచీ ఆమే ప్రధానిగా అధికారం చలాయిస్తున్నారు. ఆ క్రమంలో గత పదేళ్లుగా హసీనా కరడుగట్టిన నియంతగా మారారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అధికారాన్ని విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తున్నారని, విపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, కంట్లో నలుసుగా మారిన వారిని ఏకంగా చంపిస్తున్నారని మండిపడుతున్నాయి. అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకుని కోరుతున్నాయి. వాటి వాదనలోనూ వాస్తవం లేకపోలేదు. విపక్ష నేతలు, ముఖ్యంగా బీఎన్‌పీకి చెందిన వారు భారీగా జైలుపాలయ్యారు. కనీసం 20 మందికి పైగా తమ నేతలు, కార్యకర్తలు జైలుపాలైనట్టు బీఎన్‌పీ నాయకుడు అబ్దుల్ మొయీన్ ఖాన్ ఆరోపించారు. బీఎన్‌పీ చీఫ్ బేగం ఖలీదా జియా కూడా అవినీతి ఆరోపణలపై గృహ నిర్బంధంలో మగ్గుతున్నారు. 78 ఏళ్ల జియా ఆరోగ్యమూ బాగా క్షీణించింది. తన నియంతృత్వం, అణచివేత బయటి ప్రపంచానికి తెలియకుండా అడ్డుకునేందుకు మీడియాపైనా హసీనా ఉక్కుపాదం మోపారని విపక్షాలు దుయ్యబడుతున్నాయి. ఇక, నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనిస్‌ను కేసులతో వేధించడం ఆపాలంటూ అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాతో పాటు ఏకంగా 170 మంది అంతర్జాతీయ ప్రముఖులు హసీనాకు గత ఆగస్టులో బహిరంగ లేఖ రాయాల్సి వచ్చింది! అయినా ఆర్థిక అవకతవకల కేసులో ఆయనకు తాజాగా ఆర్నెల్ల జైలు శిక్ష పడటం గమనార్హం! ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అణచివేత తీవ్రతరం కావడంతో నిర్బంధం నుంచి తప్పించుకునేందుకు బీఎన్‌పీతో పాటు పలు విపక్షాల నేతలు భారీగా అజ్ఞాతంలోకి వెళ్లారు!! జర్నలిస్టులతో పాటు ఎవరికీ బంగ్లాదేశ్‌లో సురక్షిత పరిస్థితులు లేవని ఐక్యరాజ్య సమితి స్వయంగా పేర్కొనటం గమనార్హం.

## రైతులకు మల్లన్న కాల్వ ద్వారా సాగునీటిని అందించేందుకు కృషి : ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి



సిద్దిపేట : దుబ్బాక అభివృద్ధితోపాటు ప్రజల సంక్షేమమే తమ లక్ష్యమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రధానంగా రైతులకు మల్లన్న కాల్వల ద్వారా సాగునీటిని అందించేందుకే ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. బుధవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం వరకు దుబ్బాక మండలంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సుడిగాలి పర్యటన చేపట్టారు. మొదట పోతారం, గంభీర్పూర్, అచ్చుమాయపల్లి గ్రామాల్లో 4 ఎల్ మల్లన్న కాలువల నిర్మాణ పనులను పర్యవేక్షించారు.పలు కారణాలతో పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు ఆయన ఆదేశించారు.పదిహేను కిలోమీటర్లు మేరా కాల్వల నిర్మాణ పనుల డిజైన్ ను పరిశీలించారు. అనంతరం దుబ్బాక పట్టణంలో పోస్ట్ ఆఫీస్ నుంచి రాజపేట వరకు నిర్మించ తలపెట్టిన ఆర్ అండ్ బి రోడ్డు పనుల గురించి ఆరా తీశారు. దుబ్బాక కేసీఆర్ బడిలో జూనియర్ కళాశాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిశీలించారు.

### సమ్మె ముగిసింది.. రోడ్డెక్కిన ట్రక్కులు

న్యూఢిల్లీ,ః హిట్ అండ్ రన్ కేసుల్లో ప్రతిపాదిత కఠిన చట్టాలను నిరసిస్తూ లారీలు, ట్రక్కుల డ్రైవర్లు చేపట్టిన సమ్మె మంగళవారం దేశవ్యాప్త గందరగోళానికి, అత్యవసర సేవల్లో తీవ్ర అంతరాయానికి దారి తీసింది. ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు కూడా సమ్మెలో పాల్గొన డంతో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ కొరత ఏర్పడింది. సమ్మె రోజుల పాటు కొనసాగుతుందన్న వార్తల నేపథ్యంలో దేశమంతటా వాహనదారులంతా పెట్రోల్ బంకులకు పోటెత్తారు. దాంతో ఎక్కడ చూసినా బంకుల ముందు భారీ క్యూ లైన్లే దర్శనమిచ్చాయి. ఇది నగరాలు, పట్టణాల్లో భారీ ట్రాఫిక్ జామ్‌లకు దారితీసింది. అత్యధిక బంకుల్లో చూస్తుండగానే నిల్వలు అడుగంటి నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. వంట గ్యాస్ సిలిండర్లతో పాటు కాయగూరలు, ఇతర నిత్యావసరాల సరఫరా కూడా నిలిచిపోయి జనం తీవ్ర ఇక్కట్ల పాలయ్యారు. కేంద్రంతో ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఏఐఎంటీసీ) జరిపిన చర్చలు ఎట్టకేలకు మంగళవారం రాత్రికి ఫలించాయి. కొత్త చట్టాన్ని ఇప్పటికిప్పుడే అమలు చేయడం లేదని కేంద్రం తరఫున హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా వారికి హామీ ఇచ్చారు. దానిపై ఏఐఎంటీసీతో లోతుగా చర్చించాకే నిర్ణయం తీసుకునేలా అంగీకారం కుదిరిన్నట్టు సంఘం చైర్మన్ మల్కిత్‌సింగ్ బల్ తెలిపారు. దాంతో సమ్మె విరమిస్తున్న ట్టు సంఘం ప్రకటించింది.

## కాళేశ్వరం అవినీతిపై కిషన్ రెడ్డి గాభరా ఎందుకు?

హైదరాబాద్,కేంద్ర దర్యాప్తు సంస్థలు అంటే తమను వ్యతిరేకించేవారిని వేధించడానికి మాత్రమే అని బీజేపీ భావిస్తున్నదన్న విమర్శలు చాలా ఏళ్లుగా దేశంలో వినిపిస్తున్నాయి. ఇప్పుడు ఆ విమర్శలలో వాస్తవం ఉందా అనిపించేలా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయి. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ దర్యాప్తు కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని తాజాగా ఆయన తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాళేశ్వరం అవినీతిపై బీఆర్ఎస్ అధికారంలో ఉండగా కాంగ్రెస్, బీజేపీలు రెండూ విమర్శలు చేశాయి. అయితే బీజేపీ విమర్శలకు కేవలం విమర్శలకే పరిమితం అన్నట్లుగా ఉన్నాయి. ఎందుకంటే నిబంధనలను తోసి రాజని మరీ కాళేశ్వరం ప్రాజెక్టు కోసం కేంద్రం రుణాలు ఇచ్చింది. ఒక్క జాతీయ హోదా ఇవ్వలేదు తప్పితే.. అన్ని విధాలుగా కాళేశ్వరానికి సహాయ సహకారాలు అందించింది. మళ్లీ అదే కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కు ఏటీఎంగా మారిపోయిందని విమర్శలూ గుప్పించింది. కానీ ఏనాడూ కాళేశ్వరం అవినీతిపై విచారణకు పట్టుబట్టలేదు. అధికారంలో ఉండి కూడా బీజేపీ విమర్శలకు మాత్రమే పరిమితమైంది. పలు అంశాల్లో కేసీఆర్ ను నోటితో విమర్శిస్తూ, చేతల సహకారం అందించిన బీజేపీ ఆ పార్టీతో రహస్య మైత్రి కొనసాగడంతో బీఆర్ఎస్, బీజేపీలు దొందూ దొందే అని జనం నమ్మడంతోనే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో రెండు పార్టీలూ కలిసి మునిగిపోయాయి. ఇప్పుడు బీజేపీ కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ కోరాలని కాంగ్రెస్ సర్కార్ ను డిమాండ్ చేస్తోంది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అయితే పదే పదే ప్రెస్ మీట్లు పెట్టి మరీ ఈ డిమాండ్ చేస్తున్నారు.మరి ఇదే కిషన్ రెడ్డి బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఈ డిమాండ్ ఎందుకు చేయలేదు. కాళేశ్వరంపై ఎన్ని ఆరోపణలు వచ్చినా.. ఎందరు హస్తినకు వెళ్లి మరీ ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా ఇప్పుడు రాష్ట్రంలో బీఆర్ఎస్ ఓటమి తర్వాత, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి కాళేశ్వరం అవినీతి బాగోతాన్ని వెలికి తీస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం కాదు, కేంద్ర దర్యాప్తు సంస్థ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. వారం రోజులలో కాళేశ్వరంపై జ్యుడీషియల్ ఎంక్వైరీ వేస్తామని రేవంత్ ప్రభుత్వం గట్టిగా చెబుతోంది. అయితే కిషన్ రెడ్డి మాత్రం బీజేపీ ఉండగా, జ్యుడీషియల్ ఎంక్వైరీ ఏమిటి? మేం చెప్పినట్లు వినే సీబీఐ ఉంది అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలా రాయడం తరువాయి లేఖ సీబీఐ విచారణ మొదలయ్యేలా చూస్తామని



చెప్పారు. రేవంత్ సర్కార్ సీబీఐ విచారణకు ముందుకు రాకపోతే.. బీఆర్ఎస్ తో కుమ్మక్కైనట్లేనని అంటున్నారు. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ అంటూ హడావుడి పడుతున్న కిషన్ రెడ్డి తీరు చూస్తుంటే.. రేవంత్ సర్కార్ కాళేశ్వరం అవినీతిపై విచారణ జరపడం ఇష్టం లేకనే ఉందని పరిశీలకులు అంటున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాం పేరు చెప్పి.. బీఆర్ఎస్ తో రాజకీయం చేసిన బీజేపీ.. ఇప్పుడు కాళేశ్వరం ను కూడా తమ చేతుల్లోకి తెచ్చుకుని అవినీతి బయటకు రాకుండా చేయాలని చూస్తోందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రేవంత్ సర్కార్ కొలువుతీరి నిండా నెల రోజులు కూడా అయ్యిందో లేదో బీజేపీ హడావుడి మొదలెట్టేసింది. కాళేశ్వరం అవినీతిపై ఏళ్ల తరబడి మౌనం వహించిన బీజేపీ.. ఇప్పుడు దానిని వెలికి తీయడానికి ప్రయత్నాలను రేవంత్ సర్కార్ ప్రారంభించగానే గగ్గోలు పెడుతోంది. బీజేపీ, బీఆర్ఎస్ ల రహస్య మైత్రి ఇకెంత మాత్రం రహస్యం కాదన్న నిర్వహణ తేటతెల్లం చేస్తోంది. కాళేశ్వరంపై సీబీఐ విచారణకు రేవంత్ పట్టుబట్టడం, మరో వైపు ఎమ్మెల్సీ కవిత హిందుత్వ ఎజెండాను ఎత్తుకోవడం చూస్తుంటే సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ, బీఆర్ఎస్ లు లోపాయికారీ అవగాహనతో పని చేయాలని నిర్ణయించుకున్నాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## సంపాదకీయం

**గురువారం 04-01-2024**

# ఎన్నికల నామ సంవత్సరం

కోటి ఆశలతో కొంగొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాం. కొత్త సంవత్సర సంబురాల సందడి సద్దుమణిగింది. కడివెడు దుఃఖం, పిడికెడు సంతోషాలు మిగిల్చిన 2023 కాలవాహినిలో కలిసిపోయింది. సుస్థిర శాంతి, సౌభాగ్యాలు తెస్తాయని అందరూ ఆశిస్తున్నారు 2024 సంవత్సరానికి ఉత్సాహోద్వేగాల మధ్య ఉషోదయమైంది. ఏ రకంగా చూసినా ఇది ఓ మూలమలుపు సంవత్సరమే. ఎన్నో మైలురాళ్లు దాని గర్భంలో దాగున్నాయి. ఎన్నో మార్పులకు నాంది ప్రస్తావన జరగబోతోంది. రాజకీయ పరిశీలకులు చమత్కరిస్తున్నట్టుగా ఇది 'ఎన్నికల నామ' సంవత్సరం కావడమే అందుకు కారణం. భారత్‌తో సహా ప్రపంచంలోని అనేక దేశాల్లో ఎన్నికల నగరాలు మోగుతున్నాయి. జనాల భవిత, నేతల తలరాత తేల్చేస్తే ఎన్నికల యుద్ధానికి తెర తొలగబోతోంది. అమెరికా, రష్యాతోపాటు అగ్రగామైన యూనియన్, దక్షిణాఫ్రికా, మెక్సికో, ఇండోనేషియా వంటి 64కు పైగా దేశాల్లోని 400 కోట్లకు పైగా ప్రజలు (ప్రపంచ జనాభాలో సుమారు 49 శాతం మంది) కొత్త ప్రభుత్వాలను ఎన్నుకోనున్నారు. మరోసారి అధ్యక్ష పదవి చేపట్టాలని ఉరకలేస్తున్న డొనాల్డ్ ట్రంప్ ఆశలపై కోర్టుల ప్రతికూల తీర్పులు చల్లబడుతున్నాయి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఐదో విడత అధ్యక్ష పదవికి గుట్టుచప్పుడు కాకుండా పావులు కదుపుతున్నారు. ప్రపంచం మాటేలా కనిపించే భారత ఉపఖండానికి మా త్రం ఇది అచ్చంగా ఎన్నికల నామ సంవత్సరమేనని చెప్పాలి. ఇరుగుపొరుగు దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లోనూ ఎన్నికలు జరుగుతున్నాయి. భూటాన్‌లో కొద్దిరోజుల్లో చివరి విడత ఎన్నికల్లో అక్కడి ప్రజలు అంతిమతీర్పు చెప్పబోతున్నారు. ఇక మన దేశంలో అత్యంత కీలకమైనవి కావాలంటే పార్లమెంటు ఎన్నికలు జరిగేది ఈ ఏడాదే. మూడో విడత అధికారం కోసం ప్రధాని మోదీ ఉవ్విళ్లూరుతున్నారు. ఏదోరకంగా గట్టి పోటీనిచ్చి గద్దె దింపాలని విపక్షాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. 2024 అత్యంత క్రియాశీలమైన, పరిణామమైన, ప్రభావయుతమైన సంవత్సరంగా చరిత్ర సృష్టిని ప్రముఖ వాణిజ్య పత్రిక ఫోర్బ్స్ అంచనా వేస్తున్నది. అమెరికా జాబ్ మార్కెట్‌లో అవకాశాలు వెల్లువెత్తాయి జోస్యం చెప్పింది. అమెరికాతో పాటుగా ప్రపంచ ఆర్థికవ్యవస్థ వెలుగుల దిశగా ప్రయాణిస్తుందని గుర్తించడం శుభసూచకం. కృత్రిమ మేధ (ఏఐ)కు సంబంధించినంతవరకు ఇది నిర్ణయాత్మకమైన సంవత్సరం అవుతుందని చెప్పాలి. ఇప్పటిదాకా మనం చూసింది ట్రైలర్ మాత్రమే. ఈ ఏడాది అసలైన సినిమా తెరమీదకు వస్తుందని నిపుణులు అంటున్నారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పోయినా కొత్తరకం ఉద్యోగాలు వస్తాయనే ఆశలు కలుగుతున్నాయి. పని సంస్కృతి మార్పు మొదలుకొని క్వాంటం కంప్యూటింగ్ దాకా నూతన సర్దుబాట్ల దిశగా టెక్ ప్రపంచం ఈ ఏడాది అడుగులు వేస్తుంది. రవాణా రంగంలో నూతన ఇంధనవిష్కరణలతో పాటు స్వయంచాలక వాహన సాంకేతికత కూడా ఈ ఏడాదే స్థిరీకరణ పొందుతుందని ఆశిస్తున్నారు. ఉక్రెయి న్, గజా యుద్ధాల ప్రభావంతో రాజకీయ, ఆర్థికరంగాల్లో సవాళ్లు తప్పనిసరిగా ఎదురవుతాయి. ఈ ఏడాది యుద్ధాల పీడ విరగడైపోయి, సమస్యలు సమసిపోయి, ప్రజలందరికి సుఖశాంతులు కలగాలని కోరుకుందాం.

# కేంద్రం కక్ష సాధింపు...



హైదరాబాద్:మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెలంగాణపై వివక్ష కొనసాగుతోంది. బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఎలాంటి కొర్రీలు లేకుండా నిధులను ఇస్తున్న కేంద్రం ఇతర రాష్ట్రాల పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ప్రతి రాష్ట్రం ఏటా ఆర్థిక ప్రణాళికను రూపొందించుకుని అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టటం ఆనవాయితీ. కేంద్రం నుంచి చట్టబద్ధంగా రావాల్సిన నిధులు, రాష్ట్ర అభివద్ధి కోసం కేంద్రం ఇస్తుందని ఆశించిన నిధులతో రాష్ట్రాల పద్దులను ఖరారు చేస్తారు. ఈ రకంగానే 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.41,259 కోట్లు గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో కేంద్రం నుంచి వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అంచనా వేసుకుంది. కానీ ఆ అంచనాలు తారుమారయ్యాయి. 2023 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు కేవలం రూ.4,532 కోట్లు మాత్రమే ఈ రూపంలో కేంద్రం నుంచి మనకు అందాయి. బడ్జెట్ అంచనాల్లో కేంద్రం రాష్ట్రానికి ఇచ్చింది కేవలం 11 శాతమే. ఒకవైపు పన్నుల్లో వాటాలు ఇచ్చేందుకు కొర్రీల మీద కొర్రీలు పెడుతున్న కేంద్రం%ొా%మరోవైపు గ్రాంట్ ఇన్ ఎయిడ్ సాయంలోనూ కక్షసాధింపు ధోరణిని అవలంభిస్తున్నది. రాష్ట్రంపై మోడీ సర్కార్ చూపుతున్న ఈ వివక్షను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా(కాగ్) తన తాజా నివేదికలో స్పష్టం చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే గ్రాంట్ ఇన్ ఎయిడ్ విషయంలో తెలంగాణపై కేంద్రం వివక్ష చూపింది. ప్రారంభ మాసం ఏప్రిల్‌లో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. మేలో రూ.1438.61 కోట్లు, జూన్‌లో రూ.372.91 కోట్లు, జూలైలో రూ.506.3 కోట్లు, ఆగస్టులో రూ.691.44 కోట్లు, సెప్టెంబర్‌లో రూ.610.18 కోట్లు, అక్టోబర్‌లో రూ.216.47 కోట్లు, నవంబర్‌లో రూ.696.83 కోట్లను కేంద్రం ఇచ్చింది. ఈ రకంగా చూస్తే మోడీ సర్కార్ ఇచ్చింది మొదటి ఎనిమిది నెలల్లో ఒక్కో నెలకు సగటున బడ్జెట్ అంచనాల్లో 1.4 శాతం మాత్రమే. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మిగిలిన డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు కలిపి మొత్తంగా మరో ఐదారు శాతం గ్రాంట్లే వచ్చే అవకాశముందని ఆర్థిక నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఆ రకంగా రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ అంచనాల్లో 18 నుంచి 20 శాతంలోపే గ్రాంట్ ఇన్ ఎయిడ్ అందే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. కాగా తెలంగాణకు ఈ పద్దులో కోత పెడుతున్న కేంద్రం%ొా% బీజేపీ పాలిత రాష్ట్రాలకు మాత్రం నిధుల వరదను పారిస్తోంది. రాష్ట్రాలు చిన్నవైనా, పెద్దవైనా, వాటి వార్షిక పద్దు ఎంతనే దానితో సంబంధం లేకుండా నిధులను విడుదల చేసింది. ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌కు నవంబర్ వరకే అంచనాల్లో 102 శాతం గ్రాంట్లను విడుదల చేసింది. కేంద్రం నుంచి ఆ రూపంలో రూ.16,290.35 కోట్లు అందుతాయని గుజరాత్ ప్రభుత్వం ఆశించగా, మొదటి ఎనిమిది నెలల్లోనే రూ.16,582.02 కోట్లు అందటం గమనార్హం. ప్రస్తుత (2023-24) ఆర్థిక సంవత్సరంలో నవంబర్ వరకు బడ్జెట్ అంచనాల్లో తెలంగాణకు కేవలం 11 శాతం గ్రాంట్లనే అందించిన కేంద్రం.. బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్‌కు 101.79 శాతం, హర్యానాకు 59.57 శాతం, త్రిపురకు 45.12 శాతం, మధ్యప్రదేశ్‌కు 44.10 శాతం, ఉత్తరాఖండ్‌కు 39.23 శాతం, ఛత్తీస్‌గఢ్‌కు 33.46 శాతం, రాజస్థాన్‌కు 28.74 శాతం, ఉత్తర ప్రదేశ్‌కు 26.06 శాతం, మహారాష్ట్రకు 19.59 శాతం గ్రాంట్‌ను విడుదల చేసింది.

### విధుల్లో చేరాలని అంగన్‌వాడీలకు అల్టిమేటమ్

అమరావతి, ఏపీలో 20 రోజులకుపైగా సమ్మెలో ఉన్న అంగన్వాడీలకు ప్రభుత్వం అల్టిమేటం జారీ చేసింది. తక్షణమే విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు విధుల్లో చేరకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. విధులకు హాజరుకాని వారి వివరాలు ఎప్పటికప్పుడు పంపించాలని కిందిస్థాయి అధికారులకు సూచనలు చేసింది.

# నెరవేరని వ్యక్తిగత మరుగుదొడ్ల లక్ష్యం

కర్నూలు, దేశవ్యాప్తంగా వ్యక్తిగత మరగుదొడ్ల నిర్మాణం కోసం నేటికీ స్పష్టత లేదు. ఇంతకాలం ప్రచారం చేసినా ఇంకా లక్ష్యం నెరవేరడం లేదు. గ్రామసీమల్లోని 42 శాతం జనాభాకు నేటికీ మరుగుదొడ్లు కరవైన పరిస్థితిలో, కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలూ వాటి నిర్మాణ నిర్వహణల్ని ఓ సవాలుగా భావిస్తున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొన్ని జిల్లాల్ని ఓడీఎఫ్‌లుగా ప్రకటించింది. వార్డు కమిటీలు, స్వయంసహాయక సంఘాలు, పట్టణ సమాఖ్యల ఉమ్మడి కృషితో కొన్ని గ్రామాలు ఈ లక్ష్యం సాధించాయి.. కూలిపనులు చేసి సంపాదించిన సొమ్ముతో మరుగుదొడ్లు నిర్మించుకొని ఇతర ప్రాంతాలవారికి ఆదర్శ ప్రాయులయ్యారు. అధికారుల కృషితోనే నియోజకవర్గంలో నూరు శాతంఓడీఎఫ్ దిశగా అడుగులు పడతాయి. సమీక్షలు, సమావేశాలు నిర్వహించి సర్పంచ్‌లను పురమాయించడంతో మరుగుదొడ్ల నిర్మాణాలపై ప్రజలు దృష్టి సారించారు. దీంతో గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు ఉద్యమంలా సాగుతున్నాయి. ఓడీఎఫ్ సాధించేందుకు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ సంక్షేమ పథకాలను కట్ చేస్తూ మరుగుదొడ్ల నిర్మాణాలను ఉద్యమంలా చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో 46శాతం ప్రజలు మరుగుదొడ్లు ఉపయోగిస్తున్నారు. దీనిఇకతోడు పరిశుభ్రతకు సంబంధించిన పనులు తమకు సంబంధిం చినవి కావన్న ధోరణిలో ప్రజలు ఉన్నారు. పరిశుభ్రతా సాధనలో భాగంగా, శౌచాలయ వ్యవస్థపై ఎనలేని కేంద్రం శ్రద్ధ చూపుతోంది. బహిరంగ మలవిసర్జన రహిత ఊళ్లు, ఇంటింటా మరుగుదొడ్లు' ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యక్రమాలు చేపట్టి ఇప్పటికి మూడేళ్లు గడిచాయి. ఏపీ ప్రభుత్వం వివిధ విభాగాలవారితో ప్రచార బృందాల్ని ఏర్పాటుచేసి, మారుమూల గ్రామాలకీ పంపించీ అవగాహన పెంచేందుకు కృషిచేస్తోంది. ఏపీలోని అనేక గ్రామాలు బహిర్భూమి సమస్య నుంచి సంపూర్ణంగా బయట పడ్డాయని కేందప్రభుత్వ ఆధ్వర్యంలోని పారిశుద్ధ్య మంత్రిత్వశాఖ ఇదివరకే వెల్లడించింది. మొత్తం 72లక్షల మరుగుదొడ్లు అవసర మైన ఏపీలో ఇప్పటికే 44.1 లక్షల నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటి ఏర్పాటుతో పాటు వినియోగమూ ముఖ్యమంటూ వందల సంఖ్యలో సదస్సులు నిర్వహించారు. పాఠశాలల్లో మరుగదొడ్ల ఏర్పాటును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలి ప్రాథమ్యంగా ప్రకటించింది. ప్రభుత్వాల, ప్రజల ఆలోచనా ధోరణిని బట్టే శౌచాలయ నిర్మాణ పక్రియ ముందుకు సాగుతుంది. ఉమ్మడి భాగస్వామ్యమే స్వచ్ఛతను, శుభ్రతను సాకారం చేస్తుంది. అందుకు అనుగుణంగా అవసరమైతే కఠినచర్యలు తీసుకోవాలి. స్వచ్ఛతకు సంబంధించి ప్రజల్లో చైతన్యంతో పాటు కఠిన నిబంధనలు అమల్లోకి రావాలి. దీనిని తప్పనిసరి చేయడం ద్వారానే లక్ష్యం సాధించగలం.

# 2014-2024: మోడీ భారత్!

న్యూఢిల్లీ,సంకీర్ణ ప్రభుత్వాలతో మూడు దశాబ్దాల కాలం వృథా అయిందని, పాలన లేకపోవడాన్ని, సంతుష్టీకరణ రాజకీయాలను జనం చూశారని ప్రధాని నరేంద్రమోడీ ధ్వజమెత్తారు. ఈ కారణంగానే బిజెపిని సహజ ఎంపికగా జనం పరిగణిస్తున్నారని, 2024లో తాము ఎవరి మీద ఆధారపడని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని ఇండియా టుడే మాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. పదేండ్ల క్రితం పోల్చితే ఇప్పుడు అన్ని రంగాలు మెరుగైన పని తీరు కనపడుతున్నాయని ఉద్ఘాటించారు. వాజ్‌పాయి ప్రధానిగా ఉండగా బిజెపి 2004 ఎన్నికల్లో ఇచ్చిన నినాదం 'వెలిగిపోతున్న భారత్'. తరువాత అదే బిజెపి 2014లో ముందుకు తెచ్చిన నినాదం 'అచ్ఛిన్', తాజాగా ప్రధాని నరేంద్రమోడీ డిసెంబరు రెండవ వారంలో 'వికసిత భారత్' ప్రభుత్వ సంకల్పమని ప్రకటించారు. 2024లో ఎన్నికల్లో ఎలాంటి అనూహ్య ఉదంతాలు జరగక లేదా జరగకపోతే దాన్నే బిజెపి స్వీకరించి ఎన్నికల గోదాలోకి దిగనుంది. మూడు నినాదాలకు తేడా ఉంది. మొదటిది తమ విఫలమైన పాలనను కప్పిపుచ్చుకొనేందుకు భారత్ వెలిగిపోతోంది. కాంగ్రెస్ పాలన మీద ధ్వజమెత్తేందుకు తాము అధికారానికి వస్తే అచ్ఛేదిన్ (మంచి రోజులు) తెస్తామని ఆశచూపారు. పదేండ్ల తరువాత వాటి జాడ కనిపించడం లేదు, దీనితో మరో పాతికేండ్ల 2047 నాటికి అభివృద్ధి చెందిన వికసిత భారత్‌గా దేశాన్ని మారుస్తామని నమ్మబలుకుతోంది. అప్పటికి రాజెవరో రెడ్డెవరో !వికసిత భారత్ 2047 రోడ్ మ్యాప్ ప్రకారం ఆ సంవత్సరానికి మన దేశం అభివృద్ధి జాబితాలో చేరుతుందని చెబుతున్న దాన్ని జనం నమ్మేదెలా? అభివృద్ధి లక్షణాలలో అధిక తలసరి రాబడి ఒకటి. దాన్లో ఇప్పుడు మనం ఎక్కడున్నాం? ప్రపంచబ్యాంకు రూపొందించిన అట్లాస్ పద్ధతి ప్రకారం 2022 సంవత్సరపు వివరాల ప్రకారం 190 దేశాల జాబితాలో జిఎన్ఐ తలసరి ఆదాయం ముందున్న 59 దేశాల్లో రెండవ పెద్ద వ్యవస్థగా వున్న చైనాకే చోటు లేదు. మొదటి, మధ్యతరగతి ఆదాయ జాబితాలో రెండవది, మొత్తం దేశాలలో 61వ స్థానంలో ఉంది. మన దేశం దిగువ మధ్యతరగతి జాబితాలో 26వ స్థానంలో మొత్తం దేశాల్లో 140వదిగ ఉంది. సంకీర్ణ ప్రభుత్వాలతో దేశం వెనుకబడిందని మోడీ అన్నారు. జనానికి సమాచారం అందుబాటులో వున్నా చూస్తే ఓపిక, ఆసక్తి కూడా లేని బలహీనతను పాలకులు సొమ్ము చేసుకుంటున్నారు. సంకీర్ణ ప్రభుత్వం వున్న 2004లో భారత జిఎన్ఐ 600 డాలర్లు 2013 నాటికి 1,500కు చేరింది. వార్షిక సగటు వృద్ధిరేటు 11.48 శాతం. కాగా స్థిరమైన, స్పష్టమైన విధానాలు అమలు చేసినట్లు చెప్పుకున్న నరేంద్ర మోడీ పాలనలో 2022 నాటికి అది 2,380 డాలర్లు, వార్షిక వృద్ధి రేటు 5.44 శాతమే పెరిగింది. సూచికలో 146 దేశాలకు గాను మన దేశం 137వ స్థానంలో వుంది. కొంత అంగీకరించినా లేకున్నా మన కంటే ఎక్కువ మంది చైనా 82, నేపాల్ 85, బంగ్లాదేశ్ 99, పాకిస్థాన్ 103, శ్రీలంక 126వ స్థానాల్లో ఉన్నాయి. అయినప్పటికీ భారత్‌ను వికసింప చేసింది నరేంద్ర మోడీకే చెల్లింది. భారత్ అప్పుల పాలు కానుందని సరిగ్గా వికసిత భారత్ ప్రారంభించిన సమయంలోనే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) రూపొందించిన నివేదిక హెచ్చరించింది. ప్రపంచంలో మనదేశ స్థానం గురించి వివిధ సంస్థలు వెల్లడిస్తున్న అధికార బిజెపి, అది నడుపుతున్న ప్రభుత్వం కూడా అంగీకరించదు, తప్పుల తడకలను, వారికి లెక్కలు రాదని బుకాయిస్తున్నట్లు తెలుస్తుంది. పోనీ వారు నమ్మే వేద గణితం ప్రకారం మనం నిజంగా ఎక్కడున్నామో, ఎలా ఉన్నామో ఎప్పుడైనా చెప్పారా? ఇప్పుడు ఐఎంఎఫ్ చెప్పిందాన్ని కూడా తాము అంగీకరించడం లేదని, అవన్నీ ఊహాగానాలు తప్ప వాస్తవం కాదని కేంద్ర ప్రభుత్వం గింజుకుంది. నెరవేరని ఐదు లక్షల కోట్ల డాలర్ల జిడిపి కబుర్లు కూడా ఊహాగానమే. వర్తమాన వికసిత భారత్ కూడా అదే, వాస్తవం కాదు. వికసిత భారత్, తమ విజయం నల్లేరు మీద బండిలా సాగుతుందని చెబుతున్న పూర్వరంగంలో ఐఎంఎఫ్ విశ్లేషణ గొంతులో పచ్చివెలక్కాయ వంటిదే. ఇంతకీ అదేమి చెప్పింది? ప్రతికూల దెబ్బలు తగిలితే 2028 నాటికి జిడిపి ఎంత వుంటుందో ప్రభుత్వ అప్పు అంతకు (వంద శాతం) చేరుతుందని హెచ్చరించింది. ఒక శతాబ్దిలో ఒకసారి వచ్చే సంఖ్య19 మాదిరి విపరీత పరిణామాలు సంభవించాయని ఐఎంఎఫ్ చెప్పిందని, అలాంటివేమీ జరిగే అవకాశం లేదని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. తమ నేత అధికారానికి వచ్చిన తరువాత విదేశీ అప్పులేమీ చేయడం లేదని ప్రచారం చేస్తున్న భక్తులను సంతుష్టీకరించలేము. మాక్రోట్రెండ్స్ నెట్ సమాచారం ప్రకారం 1970లో ఎనిమిది బిలియన్ డాలర్లుగా వున్న విదేశీ అప్పు నూతన ఆర్థిక విధానాలను అమల్లోకి తెచ్చిన 1990 నాటికి 83 కి చేరింది. తరువాత పదేండ్లకు 101, 2010 నాటికి 290, నరేంద్ర మోడీ అధికారానికి వచ్చేనాటికి 457 బి.డాలర్లకు చేరింది. ఐఎంఎఫ్ తాజా



విశ్లేషణ ప్రకారం 2024 మార్చి నాటికి 681, మరుసటి ఏడాది మార్చికి 748 బిలియన్ డాలర్లు పెరుగుతాయని అంచనా వేసింది. వార్షిక అప్పు పెరుగుదల శాతాల్లో ఎగుడు దిగుళ్లు తప్ప మొత్తంగా చూసినపుడు పెరుగుదల ధోరణే వుంది. ఇదే కాలంలో కేంద్ర ప్రభుత్వ దేశీయ రుణభారం 58.6 లక్షల కోట్ల నుంచి 156.6 లక్షల కోట్లకు 174% పెరిగింది. కారణంగా ఇంత అప్పు చేశాము, ఉచితంగా వ్యాక్సిన్లు వేశాము అని బిజెపి పెద్దలు చెప్పవచ్చు. ఇన్ని లక్షల కోట్లు దానికే తెచ్చారా? బడ్జెట్ పత్రాల్లో దాని ప్రకారం 2024 మార్చి నాటికి దేశీయ అప్పు రూ. 164 లక్షల కోట్లు, విదేశీ అప్పు 5 లక్షల కోట్లు కలిపితే రు.169 లక్షల కోట్లకు చేరనుంది. ఐఎంఎఫ్ ఒక్క రుణం గురించి మాత్రమే చెప్పలేదు. నవంబరు 20 నాటికి సంస్థ సిబ్బంది మన దేశ ఆర్థిక అంశాల గురించి రూపొందించిన 142 పేజీల నివేదికను డిసెంబరు మూడవ వారంలో బహిర్గతం చేశారు. దానిలో గత పది సంవత్సరాల పాలన డొల్లతనం, వైఫల్యాల గురించి చెప్పబడింది. నివేదిక పదజాలంలో ఆ మాటలు లేకపోవచ్చు గానీ అచ్ఛేదిన్ పాలనలో అంకెలు చెబుతున్న అంశాలు సారమిదే. వస్తు ఎగుమతులు 2019 20లో 320 బిలియన్ డాలర్లు ఉంటే తదుపరి రెండు సంవత్సరాల్లో వరుసగా 296, 429 బి.డాలర్లుగా ఖరారు చేసిన లెక్కలు చెబుతున్నాయి. తరువాత 2022 23లో 456, వర్తమాన సంవత్సరంలో 436, వచ్చే ఏడాది 460 బిలియన్ డాలర్ల అంచనాలుగా ఐఎంఎఫ్ సూచించింది. ఎగుమతుల ప్రోత్సాహకం పేరుతో పక్కన పెట్టిన రెండు లక్షల కోట్ల రూపాయల వలన అదనంగా పెరిగిందేముంది? మేకిన్, మేడిన్ ఇండియాల జాడ ఎక్కడ? పిఐబి 2022 జూలై 29న విడుదల చేసిన సమాచారం ప్రకారం 201718లో జిడిపిలో వస్తు ఎగుమతుల శాతం 11.4 కాగా, 2021 22లో 13.3 శాతంగా ఉంది. ఐదు సంవత్సరాల సగటు 11.78% ఉంది. వస్తువులు, సేవలు ఎగుమతులు ఈ కాలంలోనే 18.8 శాతం నుంచి 21.4 శాతం మధ్య వున్నాయి. సగటు 19.5 శాతమే ఉంది. అందువలన వాటిలో కూడా పెద్దగా పెరుగుదల లేదు. మాక్రోట్రెండ్స్ అనే పోర్టల్ సమాచారం ప్రకారం 2004 నుంచి 2013 వరకు ఏటా సగటున 22.1 శాతం ఎగుమతులు జరిగాయి. ఈ లెక్కన మోడీ ఏలుబడిలో దిగుమతులు పడిపోయినట్లా పెరిగినట్లా ? దేశ ప్రతిష్ఠను, మార్కెట్లను పెంచేందుకు నరేంద్ర మోడీ విదేశాలు తిరిగినట్లు, విశ్వగురువుగా మారినట్లు ఎంతగా చెప్పుకున్నా మోడీ లావు పొడుగూ చూసి ఎవరూ ముబ్బడిగా దిగుమతులు తీసుకోవడం లేదు. యుపిఏ హయాంలో దేశ దిగుమతులు జిడిపిలో సగటు సగటు 26.4% వుంది. నరేంద్ర మోడీ అధికారానికి వచ్చిన తరువాత తొమ్మిది సంవత్సరాలలో సగటున 22.9% చొప్పున ఉన్నాయి. మన ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఎందుకు ఉన్నాయంటే తాము చేసిన ఆర్థికవృద్ధి కారణంగా జనంలో కొనుగోలు శక్తి పెరిగి దిగుమతులకు గిరాకీ ఏర్పడిందంటారు బిజెపి నేతలు. ఒకవేళ అదే వాస్తవమైతే జిడిపిలో దిగుమతుల శాతం యుపిఎ హయాంలోనే ఎక్కువ ఉంది, అంటే బిజెపి కంటే మెరుగైన పాలన అందించినట్లుగా భావించాలి. విదేశీ వాణిజ్య లోటు యుపిఎ పాలనా కాలంలో సగటున ఏటా జిడిపిలో 2.26 శాతం ఉంది. 2004లో 0.3% నుంచి మధ్యలో 4.8 శాతం పెరిగి 2013 నాటికి 1.7 శాతం తగ్గింది. నరేంద్ర మోడీ ఏలుబడిలో ఎనిమిది సంవత్సరాలలో వార్షిక సగటు 1.45% మధ్యలో ఒక ఏడాది 0.9% మిగులు ఉంది. 2014లో 1.3 శాతంగా ఉన్న లోటు 2022లో 2.6 శాతం పెరిగింది. సూచిక పైకి చూస్తున్నది తప్ప కిందికి రావడం లేదు. మొత్తంగా చూసినపుడు వికసిత భారత్ కనుచూపులో కనిపించకపోయినా పట్టపగలు అరుంధతి నక్షత్రాన్ని చూపిన మాదిరి చెబుతున్నారు. ఒకసారి చెప్పినదాన్ని మరొకసారి మాట్లాడకుండా కొత్త పాట అందుకుంటున్నారు, అదే బిజెపి, నరేంద్ర మోడీ ప్రత్యేకత !

# విజయం అంత వీజీ కాదు!

అమరావతి,మొత్తానికి ఒంగోలులో సిట్టింగ్ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులు రెడ్డి వ్యవహారం ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. నేనెక్కడి వెళ్ళను ఒంగోలులోనే ఉంటా.. ఒంగోలు నుంచే పోటీ చేస్తా అంటూ ప్రకటనలు ఇస్తూ తన పంతాన్ని నెగ్గించుకున్నారు. ఒక దశలో వచ్చేఎన్నికల్లో బాలినేనికి టికెట్ దక్కదని గట్టిగా వినిపించింది. వైసీపీ అధినేత జగన్ ఇప్పుడు అభ్యర్థుల మార్పు పనిలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ కావాలనే గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబును తప్పించి ఇక్కడ నుంచి బాలినేని పోటీ చేయాలని సీఎం జగన్ భావించారు. కానీ బాలినేని మాత్రం ఒంగోలు నుండే పోటీ చేస్తానని తనకు తానే టికెట్ ప్రకటించేసుకున్నారు. దీంతో ఆయన పార్టీని వీడడం లేదా వైసీపీ ఆయనకు సీటు కేటాయించకపోవడం జరుగుతుందని రాజకీయ వర్గాలు భావించాయి. బాలినేని కూడా జనసేన పార్టీతో టచ్ లోకి వెళ్లారని ప్రచారం జరిగింది. కానీ బాలినేని పంతం ముందు జగన్ మోహన్ రెడ్డి మొండితనం ఓడిపోయింది. ఎంతైనా బంధువులు కదా ఏం చర్చిస్తారో.. ఏం నిర్ణయించుకున్నారో కానీ ఫైనల్ గా ఒంగోలు బాలినేనిదేనని తేల్చేసినట్లు తెలుస్తున్నది. బాలినేని సీటు దక్కించుకున్న విషయంలో తన పంతం అయితే నెగ్గించుకోగలిగారు కానీ, ఈసారి ఇక్కడ గెలవడం మాత్రం అంత ఈజీ కాదు. దానికి సవాలక్ష కారణాలున్నాయి. అందులో ఆయనకి ఆయన చేసుకున్నవి కొన్ని కాగా.. పార్టీ చేసినవి ఉన్నాయి. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రిగా బాలినేని దాదాపు మూడు రోజుల పాటు ఉన్నారు. కానీ ఆ తర్వాత మంత్రి పదవి నుంచి తప్పించుకోవడంతో ఆయనలో అలక మొదలైంది. బాలినేని గత రెండున్నరేళ్లుగా చీటికి మాటికి పార్టీమీద అలగటం, సొంత పార్టీ నేతలపైనే విమర్శలు గుప్పించడం, పరోక్షంగా జగన్ పైన కూడా వాగ్బాణాలు సంధించడం తెలిసిందే. సొంత పార్టీ నేతలే అరాచకాలు, అక్రమాలు ఆధారాలతో సహా బయటపెట్టారు. అయితే బాలినేని అలిగిన ప్రతిసారి జగన్ ఆయనను బుజ్జగించి సముదాయించారు. కానీ బాలినేని డిమాండ్లు మాత్రం పరిష్కారం కాలేదు. దీంతో అటు బాలినేని వర్గం సంతృప్తిగా లేదు.. బాలినేని చేష్టలతో ఆయన వ్యతిరేక వర్గం కూడా సంతృప్తిగా లేదు. రేపు ఈ రెండు వ్యక్తులు కలిసి పనిచేయడం దాదాపు అసంభవంగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. బాలినేని ఆరోపించినట్లు జగన్ ప్రభుత్వంలో ఒంగోలులో అవినీతి, అక్రమాలు రాజ్యమేలాయి. ఇసుక దందాతో ఒక వర్గం కోట్లకు పడగలెత్తినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇతర దేశాలలో ఉంటూ ఇక్కడ ఆస్తులు కలిగి ఉన్నవారి కుటుంబాలను టార్గెట్ చేసి భారీ స్థాయిలో అక్రమ నిర్మాణాలు జరిగాయి. బాలినేనినే ఆధారాలతో సహా బయటపెట్టగా.. అప్పట్లో పోలీసులు పదిమందిని అరెస్ట్ చేశారు. అయితే, అసలు దొంగలు మాత్రం దర్జాగానే ఉన్నారు. ఇది పార్టీకి ఇక్కడ అతిపెద్ద మైనస్. అలాగే ఒంగోలు నగరంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. బాలినేని మంత్రిగా ఉన్నా, ఎమ్మెల్యేగా ఉన్నా నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. సమూహం తగాదాలు, ఆధిపత్య పోరుతో కాలం గడిపేశారు తప్ప ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదు. ఆ మాటకొస్తే ప్రభుత్వం ఈ నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. దీంతో ప్రభుత్వ వ్యతిరేకత ఇక్కడ తారస్థాయిలో ఉంది. దీనికి తోడు పార్టీలో వర్గపోరు. బాలినేని అంటేనే ఆయన వ్యతిరేక వర్గం మండిపడుతున్నారు. అదే సమయంలో తెలుగుదేశం అభ్యర్థి దామచర్ల జనార్దన్ ఈ ఐదేళ్లలో నియోజకవర్గంపై పట్టు బిగించారు. కొండెపి ఎస్సీ రిజర్వ్ కావడంతో ఒంగోలుకు వచ్చిన జనార్దన్ గత ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెట్టించారు. అంతకు ముందు ఇదే బాలినేని ఇక్కడ ఎమ్మెల్యే అయినా ఒంగోలు అభివృద్ధిని పట్టించుకోలేదు. కానీ జనార్దన్ వచ్చి రాగానే నగర రూపరేఖలు మార్చేశారు. అప్పుడు ఆయన ఎక్కడ ఆపారో ఒంగోలు నగరం ఇప్పటికీ అక్కడే ఉంది. జనార్దన్ తోనే ఒంగోలు నగర అభివృద్ధి అనే ముద్ర ప్రజలలో గట్టిగా పడింది. దీనితో ప్రజలే ఆయనను ఓడించి తప్పు చేసినట్లు. జనార్దన్ హయాంలో నియోజకవర్గం ఎలా ఉంది.. ఇప్పుడు ఎలా ఉంది అనేది స్పష్టంగా కనిపించింది. అటు సొంత పార్టీలో బాలినేనికి పట్టు తగ్గడం, ప్రజల్లో అసంతృప్తి, దామచర్ల సానుభూతి కలిసి.. ఈసారి ఒంగోలులో బాలినేని గెలుపు అంత వీజీ కాదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# మేధోమథనంలోంచి పుట్టిందే కాళేశ్వరం

## విశాఖలో జిల్లా సహాయక నిధి ఏర్పాటు

విశాఖపట్టణం,నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా విశాఖ జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున ఔదార్యాన్ని చాటుకున్నారు. గొప్ప మానవత్వాన్ని ప్రదర్శించారు. తన నెల జీతం మెత్తాన్ని నిరుపేదలు, నిస్సహాయుల కోసం కేటాయించారు. అంతే కాదు అందరూ ఈ క్రతువులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దీంతో కలెక్టర్ పిలుపు మేరకు విశాఖపట్నం జిల్లాలో పనిచేస్తున్న వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగులు అందరూ నిరుపేదలు, నిరాశ్రయుల సహాయం కొరకు ఏర్పాటు చేసిన సంజీవనీ నిధి డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు స్వచ్ఛందంగా రూ.14,22,368 విరాళాలుగా అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. స్వయంగా జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున నే తన ఒక నెల జీతం రూ.1,10,000/- అందజేసి తన పెద్ద మనసును చాటుకోవడంతో మిగతా ఉద్యోగులు కూడా ఉద్యమంలా ముందుకు వచ్చారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయ సిబ్బంది రూ.12,000/-, రెవెన్యూ డిపార్టుమెంటులో విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, ఉద్యోగులు, ఏపీ రెవెన్యూ అసోసియేషన్, విశ్రాంత ఉద్యోగులు ఇతర వివిధ శాఖల ఉద్యోగులు రూ.2,85,845 చెక్కులను సంజీవని నిధి డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్ కి చెక్కులు, డీడీలు రూపంలో విరాళాలుగా అందజేశారు. ఈ మొత్తాన్ని నిరాశ్రయులకు ప్రత్యేక సందర్భాల్లో వైద్య ఖర్చులు, విద్య, పోషకాహారం తదితర అవసరాల కొరకు ఆర్థిక సహాయం అందించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. నిరుపేదలు, నిరాశ్రయులను ఆదుకొనేందుకు జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున సంజీవని నిధి పేరుతో గత ఏడాది జనవరి 1వ తేదీ డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్ (డీఆర్ఎఫ్)ను ఏర్పాటు చేశారు. కొత్త సంవత్సరం తొలిరోజున దీన్ని కలెక్టర్ ప్రారంభించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు తన వద్దకు వచ్చేవారు స్వీట్లు, పండ్లు, బొకేలు తేవద్దని, శక్తిమేర సంజీవని నిధికి విరాళమివ్వాలని అప్పట్లోనే పిలుపునిచ్చారు. అంతేకాకుండా గత ఏడాది కూడా తన వంతుగా ఒకనెల వేతనం రూ.1.10లక్షలు విరాళంగా ఇచ్చారు. గత ఏడాది కూడా కలెక్టర్ పిలుపునకు ఉద్యోగులు, అధికారులు స్పందించారు. ఒక్కరోజు వ్యవధిలో ఏకంగా రూ.10,92,998 జమ అయింది. ఈసారి అది 14 లక్షల 22 వేలకు చేరింది.

## భారీగా పెరిగిన బియ్యం ధరలు..

హైదరాబాద్: నిన్నమొన్నటి వరకు వంటనూనెలు, కూరగాయల ధరలు సామాన్యులను భయపెడితే ఇప్పుడా జాబితాలోకి బియ్యం వచ్చి చేరాయి. గతంలో ఎన్నడూ లేనంతగా బియ్యం ధరలు పెరుగుతుండడం కలవరపెడుతున్నది. నిన్నమొన్నటి వరకు కిలో బియ్యం రూ. 45 నుంచి రూ.50 మధ్య లభించగా ఇప్పుడా ధర ఏకంగా రూ. 60కి పెరిగింది. కొంచెం మంచి రకాలైతే రూ. 70 వరకు చెల్లించుకోవాల్సి వస్తున్నది. ప్రజలు ఎక్కువగా వినియోగించే సన్న రకాలైన బీపీటీ, హెచ్ఎంటీ, సోనామసూరి ధరలు సగటున క్వింటాలుకు రూ.1000 నుంచి రూ. 1500 వరకు పెరిగాయి. నిరుడు క్వింటాలు రూ. 4,500 నుంచి రూ. 5 వేల మధ్య లభించగా ఇప్పుడు ఏకంగా రూ. 6,200 వరకు పెరిగింది. ఇందులో పాతబియ్యం అయితే రూ.7,500 వరకు పలుకుతున్నది. హెచ్ఎంటీ, బీపీటీ కొత్త రకం బియ్యం ధర గతంలో క్వింటాలుకు రూ. 3,300 నుంచి రూ. 3,500 వరకు ఉండగా ఇప్పుడది రూ. 4,500కు చేరింది. మొత్తంగా బియ్యం ధరలు సగటున రూ. 1000 పెరిగాయి.

### తగ్గిన సన్నాల సాగు

బియ్యం ధరల పెరుగుదలకు ఆయా రాష్ట్రాల్లో వరిసాగు తగ్గడం కూడా ఒక కారణమని చెప్తున్నారు. నిజానికి ఈ వానకాలంలో దేశవ్యాప్తంగా వరిసాగు పెరిగినప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో మాత్రం వర్షాభావ పరిస్థితులకు తోడు, మరికొన్ని రాష్ట్రాల్లో వరదల కారణంగా భారీగా పంటనష్టం సంభవించింది. ఇది అంతిమంగా బియ్యం ధరపై ప్రభావం చూపిస్తున్నది. దీనికితోడు సన్నాల సాగు కూడా గణనీయంగా పడిపోయింది. ప్రతి ఏటా వానకాలంలో మొత్తం సాగులో 50 శాతం సన్నాలు ఉండగా, ఈసారి మాత్రం 30 శాతానికే పరిమితమైంది. తెలంగాణలో ఈ వానకాలంలో రికార్డుస్థాయిలో 65 లక్షల ఎకరాల్లో వరిసాగైంది. ఈ లెక్కన దాదాపు 1.40 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి కావాల్సి ఉండగా పౌరసరఫరాల సంస్థ కొనుగోలులో ఇది 45 లక్షల టన్నులకే పరిమితమైంది. గతంలో ఎంతోకొంత సన్నాలు వచ్చేవి. ఈ సీజన్‌లో మాత్రం కేజీ బియ్యం కూడా కొనుగోలు కేంద్రాలకు రాలేదు. బియ్యం ధరలు అమాంతం పెరగడంతో సామాన్యుల బడ్జెట్‌కు చిల్లు పడుతున్నది.

### మరింత పెరిగే అవకాశం

బియ్యానికి ప్రస్తుతం ఉన్న డిమాండ్‌ను మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. హైదరాబాద్‌లో సాధారణ రకం బియ్యం 25 కిలోల బస్తా ధర రూ. 180 నుంచి రూ. 250 చొప్పున పెరిగింది. ఈ లెక్కన గతంలో రూ.1200 ఉన్న 25 కిలోల బస్తా ధర ప్రస్తుతం రూ. 1,350 వరకు ఉంది. ఫైన్ క్వాలిటీ బియ్యమైతే రూ. 1,650-1,800 మధ్య పలుకుతున్నది. ఇదే పరిస్థితి కొనసాగితే ముమ్మందు ధరలు మరింత పెరగక తప్పని పరిస్థితి నెలకొంటుందని వ్యాపారులు చెప్తున్నారు.

## బంగ్లాదేశ్ ఆర్థికవేత్త మహ్మద్ యూనస్‌కు జైలు

ఢాకా,బంగ్లాదేశ్ ఆర్థిక వేత్త, నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ మహ్మద్ యూనస్ (83)కు కోర్టు సోమవారం ఆరు నెలల జైలు శిక్ష విధించింది. కార్మిక చట్టాలను ఉల్లంఘించినందుకు గారే ఆయనకు కోర్టు జైలు శిక్ష విధించింది. మరో ముగ్గురితో కలిసి ఆయన స్థాపించిన గ్రామీణ్ టెలికం సంస్థలో కార్మికుల సంక్షేమ నిధిని నెలకొల్పడంలో విఫలమైనట్లు మూడో కార్మిక న్యాయస్థానం జడ్జి షేక్ మరీనా సుల్తానా తీర్పు సమయంలో పేర్కొన్నారు. గ్రామీణ టెలికాం ఛైర్మన్‌గా చట్టాన్ని ఉల్లంఘించినందుకుగానూ అతని కంపెనీకి చెందిన మరో ముగ్గురు ఎగ్జిక్యూటివ్‌లతో పాటు యూనస్‌కు ఆరు నెలల సాధారణ లేదా కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ నలుగురిపై కార్మిక సంక్షేమ నిది సమకూర్చలేదనే ఆరోపణలు వచ్చాయి. కార్మిక చట్టాల్ని ఉల్లంఘించారంటూ కేసు నమోదైంది. దీంతో జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి 25 వేల బంగ్లా టాకాల చొప్పున జరిమానా కోర్టు విధించింది. జరిమానా చెల్లించడంలో విఫలైమైతే మరో 10 రోజులు అదనంగా జైలు శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది. తీర్పు అనంతరం యూన‌స్‌తోపాటు మిగతా ముగ్గురు బెయిల్ కోసం ప్రయత్నించారు. 5 వేల విలువైన టాకా బాండ్ సమర్పించగా న్యాయమూర్తి నెల రోజులపాటు బెయిల్ మంజూరు చేశారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించే వీలుంటుంది. బంగ్లాదేశ్‌లో జనవరి 7న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఈ పరిణామం చోటుచేసుకోవడం రాజకీయ ప్రేరేపితమనే ఆరోపణలు వస్తున్నాయి. కాగా డాక్టర్ మహ్మద్ యూనస్ పేదరిక వ్యతిరేక ప్రచారానికి గానూ 2006లో నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకున్నాడు. యూనుస్ కార్మిక చట్టం, నిధుల దుర్వినియోగానికి సంబంధించి పలు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.



హైదరాబాద్,వేలాది రైతన్నల ఆత్మహత్యల శోకసంద్రం నుంచి, పుట్టిన గడ్డమీదే రెండోశ్రేణి పౌరులుగా చూడబడుతుంటే ఆత్మ గౌరవం కోసం రగిలిపోయిన లక్షలాది ప్రజల హృదయాంతరాల్లోంచి జనించింది తెలంగాణ నినాదం, స్వయం పాలన కోసం రాష్ట్ర సాధన ఉద్యమం.వలస పాలన తమ ప్రాంతాలకు తరలిపోతున్న కృష్ణా, గోదావరి జలాలను, ఇక్కడి బీళ్ళకు మళ్లించి నెత్తురొలుకుతున్న నేలపై పచ్చని పైరులను, హరితవనాలను సృష్టించాలని, 'కోటి రత్నాల వీణ తెలంగాణ'ను కోటి ఎకరాల మాగాణంగా చూడాలని, 'మా నీళ్లు మాకే' మర్ల బడ్డతెలంగాణ ఉద్యమ ఆకాంక్షల ప్రతిరూపంగా, నీటి తావుల కోసం మేధస్సులను మధించి తొవ్వలు వెతికిన ఈ ప్రాంత ఇంజినీర్ల కృషి, ఉద్యమనేతల మహా సంకల్పం నుంచి ఉద్భవించిందే ఈ మహా 'కాళేశ్వరం'!కాలి ఎముక విరిగితే అతికించుకుంటాము తప్ప 'శరీరం వృథా' అని ఎలా అనుకోకుండా వందలాది పియర్ల/ పిల్లర్లలో ఒకటి రెండు నేలల్లోకి జారితే 'బ్యారేజీలన్నీ వృథా' అని భావించరాదు. 'సూర్యుణ్ణి చూపెడితే చూపుడు వేలు వైపు చూస్తే మనస్తత్వాల'ను మార్చుకోవాలి. ప్రజాధనంతో సృష్టించేది ఏదైనా, ఎవరు దానికి జీవంపోసి రూపం ఇచ్చినా దాన్ని ప్రజల సంపదగానే భావించాలి.కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మీబ్యారేజీ) నిర్మాణ స్థలం ప్రాంతంలో బ్యారేజీ నిర్మించాలనే ఆలోచన, రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని ఎత్తిపోయాలని, దిగువ ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలని 'తెలంగాణకు ప్రత్యామ్నాయంగా సూచించింది ప్రఖ్యాత ఇంజినీర్ కీ.శే.టి.హన్మంతరావు. ఆ ఆలోచనలను వెలికితీసి గోదావరి నదిపై అమలు చేయాలనుకున్నది మాజీ సీఎం కేసీఆర్. ఆ ప్రణాళికకు రూపుదిద్దుకుంది కేంద్ర సంస్థ వ్యాప్కోస్ ప్రభుత్వ బృందం. దాన్ని అమలుచేసింది ప్రభుత్వం. తెలంగాణను నిండు కుండలా మార్చింది, మార్చబోతోంది కాళేశ్వరం. ఉత్తర, దక్షిణ తెలంగాణకూ జీవనాడి గోదావరికి ప్రాణం పోసిన ప్రాణహిత సహజ ప్రవాహ జలధార కాళేశ్వరం.కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలోని ఐదుగురు మంత్రుల బృందం ఈ నెల 30న కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన సందర్భంగా ఈఎన్‌సీ (ఇరిగేషన్) మురళీధర్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎంతో ప్రాజెక్టుతో కూడిన ఓపికతో వివరించారు. కాళేశ్వరంపై మొదటిసారి ఒక అవగాహన ఏర్పరచుకునే అవకాశం మంత్రులకు లభించింది. ఈ ప్రజెంటేషన్ ద్వారా కాళేశ్వరంపై అపోహలు, అనుమానాలను తొలగిస్తూ వాస్తవ పరిస్థితిని ప్రజ ల ముందుంచారు అధికారులు.ఈ ప్రజెంటేషన్ వీక్షించిన అనంతరం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ నీటి పారుదల శాఖా మం త్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి 'కాళేశ్వరం ఒక ఫెయిల్యూర్ ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్టుతో ఎలాంటి ప్రయోజనం లేదు.. 'తుమ్మడిహెట్టి వద్ద బ్యారేజీ మార్చడం వెనుక రాజకీ య, ఇతర కోణాలున్నాయి..' అని తీవ్రమైన వ్యాఖ్య లు చేశారు. ఈ వ్యాఖ్యలు దురదృష్టకరం.కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ ప్రాజెక్టు పూర్వాపరాలు తెలుసుకోవడం అవసరం.

### తుమ్మడిహెట్టి బ్యారేజీ సాధ్యమయ్యేనా!

ప్రాణహిత ప్రాజెక్టును ముందుగా ప్రతిపాదించింది తెలంగాణ రిటైర్డు ఇంజినీర్లు. వారిలో ముఖ్యులు విశ్రాంత చీఫ్ ఇంజినీర్లయిన వెంకటరామారావు, అనంతరాములు, ప్రభాకర్. వీరు తయారుచేసిన ప్రాథమిక సాధ్యాసాధ్య నివేదికను ఇంజినీర్స్ ఆఫ్ ఇంజినీర్స్ సదస్సులో చర్చించి తుదిమెరుగులు దిద్దారు.కీ.శే.ఆర్.విద్యాసాగర్‌రావు, భీమయ్య ఈ నివేదికను తెలంగాణ ప్రజాప్రతినిధుల ముందుపెట్టి వారి సలహాలు స్వీకరించి అవసరమైన మార్పులు చేసిన తర్వాత 2005లో అప్పటి మంత్రి హరీశ్‌రావు చొరవతో ఆనాటి సీఎం కీ.శే.వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఒప్పించి 27-6-2005 నాడు డీపీఆర్ తయారీకి జీవో జారీ చేయబడింది. ప్రతిపాదిత 12 లక్షల ఎకరాలు ఆ జీవోలో 5 లక్షల యాభై వేల ఎకరాల ఆయకట్టుకు కుదించింది. టీఆర్ఎస్ మంత్రుల నిరసన వల్ల ముఖ్యమంత్రి జోక్యంతో ఆ జీవోను 12 లక్షల ఎకరాలకు సవరించారు.16.05.2007న ఈ ప్రాజెక్టు కోసం రూ.17,875 కోట్ల పరిపాలన అనుమతులనిచ్చింది ప్రభుత్వం. కొద్దిరోజుల్లోనే ప్రాజెక్టు వ్యయాన్ని రూ.38,500 కోట్లతో 16.40 లక్షల ఎకరాలకు ఆయకట్టును పెంచుతూ 17-12-2008న మరో జీవోను జారీచేసింది. చేవెళ్ళ ప్రాంత ఆయకట్టును అదనంగా చేర్చి ప్రాజెక్టు పేరు 'ప్రాణహిత-చేవెళ్ళ'గా మార్చారు వైఎస్. కేవలం ఏడాదిన్నర కాలంలోనే ఆయకట్టు పెంపు 34 శాతం కాగా వ్యయాన్ని 115 శాతం పెంచిన ఘన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది. కేంద్ర జల సంఘం అనుమతి ఏప్రిల్ 2010లో లభించింది 2008 జూన్ నుంచి మే 2009నాటికే ఈ ప్రాజెక్టుల కాంట్రాక్టర్లకు అప్పగించారు. ప్రాణహిత నదిపై బ్యారేజీకి మహారాష్ట్ర అనుమతి కోరకుండా చేవెళ్ల వద్ద కాల్వలకు శంకుస్థాపన చేసి కమీషన్ల కోసం ఈపీసీ పద్ధతిలో కాంట్రాక్టర్లకు మొబిలైజేషన్ అడ్వాన్సులు చెల్లించారు.అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిపై మహారాష్ట్ర ఒత్తి డి పెంచడంతో 6-5-2012న ఇరువైపులా మధ్య అంతర్రాష్ట్ర బోర్డు ఏర్పాటుకు ఒప్పందం కుదిరింది. జనవరి 2013లో జరిగిన బోర్డు తొలి సమావేశంలోనే మహారాష్ట్ర ప్రభుత్వం 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణ అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. 15.10.13న ఇదే విషయమై తమ వ్యతిరేకతను తెలుపుతూ 'ఆంధ్రప్రదేశ్ ఏకపక్షంగా నిర్మాణం కొనసాగించడం వల్ల ముమ్మందు జరిగే నష్టానికి వారే బాధ్యులవుతారని' తన వ్యతిరేకతను ప్రకటించారు మహారాష్ట్ర.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తన జన్మదినం రోజు ముం బైలో జరిగిన ఇరువురి ముఖ్యమంత్రుల సమావేశంలో మరోమారు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ 152 మీటర్ల ఎత్తుకు తమ ప్రభుత్వం ఏ పరిస్థితిలోనూ అంగీకరించదని, ముంపు తగ్గించే ప్రత్యామ్నాయాలను అన్వేషించవలసిందిగా కేసీఆర్‌ను నిర్దేశించారు.అంతకుపూర్వం 2014లో జూలై అప్పటి నీటి పారుదల శాఖామంత్రి ముంబయికి ఆ రాష్ట్ర మంత్రితో, అధికారులతో వెళ్లి చర్చించినా వారు ఒప్పుకోలేదు.26.10.2015న హైదరాబాద్‌లో జరిగిన రెండు పంపిణీల చీఫ్ ఇంజినీర్ల స్థాయి సమావేశం 148 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తును అనుమతించేది లేదని మహారాష్ట్ర అధికారులు స్పష్టం చేశారు.మరోపక్క జూలై 2008లోనే 'ప్రాణహిత ప్రాజెక్టు ప్రతిపాదనలో నీటి నిల్వ తగినంత లేద'ని కేంద్ర జల సంఘం అభ్యంతరం తెలిపింది. ఆ నివేదికలో 160 టీకాలకు వినియోగించుకోవడానికి కేవలం 14.70 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లనే ప్రభుత్వం చేర్చింది. ఫిబ్రవరి 18, 2015న తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర జల సంఘం రాసిన మరో లేఖలో '160 టీఎంసీల వినియోగానికి 14.70 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం గల రిజర్వాయర్లు చాలవ'ని స్పష్టం చేసింది.కేంద్ర జలసంఘం 4.3.2015న ప్రాణహిత ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్‌కు రాసిన మరో లేఖలో తుమ్మడిహెట్టి వద్ద లభ్యమయ్యే నీటి పరిమాణం 165 టీఎంసీలు కాగా, పోటీలు (మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్) వాడుకోవాల్సిన 63 టీఎంసీలు పోగా తెలంగాణకు మిగిలేది 102 టీములు మాత్రమేనని స్పష్టం చేసింది.మహారాష్ట్ర పట్టుబడుతున్నట్టు ప్రాజెక్టు బ్యారేజీ ఎత్తును 148 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ఎల్లంపల్లికి తరలించే నీటి పరిమాణం 44 టీఎంసీలు మాత్రమే. బ్యారేజీ ఎత్తు 4 మీటర్లు తగ్గడం వల్ల 5 టీఎంసీల నీటి నిల్వ అంచనా 1.8 టీకాలకు తగ్గుతుంది.మహారాష్ట్ర సూచన ప్రకారం 148 మీటర్ల ఎత్తులో తుమ్మడిహెట్టి వద్ద బ్యారేజీని వేన్‌గంగ-వార్ధా నదుల సంగమ ప్రదేశం కనుక 40 డిగ్రీల స్క్యూ (%ూనెవష%) లో నిర్మించాలి. బ్యారేజీ గేట్లకు నీటి ప్రవాహం 90 డిగ్రీల లంబకోణంలో రావాలంటే బ్యారేజీ డిజైన్ ప్రత్యేకంగా చేయవలసి ఉంటుంది. ఇది ఎంతో ముఖ్యమైనది. మన దేశంలో కానీ, ఇతర దేశాల్లో కానీ స్క్యూ బ్యారేజీలు ఎక్కడా లేవు. సుమారు 110 గేట్లు ఉంటే ఈ బ్యారేజీ రెండు వైపులా మట్టి కట్టలతో సుమారు 6 ఎత్తులో ఉంటుంది. ఇప్పుడిది నిర్మించాలంటే సుమారు 4 వేల కోట్ల రూపాయలకు పైనే వ్యయమవుతుంది.తుమ్మడిహెట్టి బ్యారేజీకి ఎడమ వైపున చాప్రాల్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ఉంది. కేంద్ర వన్యప్రాణి సంరక్షణ బోర్డు నుంచి అనుమతులు సాధించడం సాధ్యపడకపోవచ్చు.బ్యారేజీ 4 మీటర్లు తగ్గడం వల్ల 2014నాటికే 152 మీటర్ల ఎత్తును దృష్టిలో పెట్టుకొని భారీ స్థాయిలో (రోజుకు ఒకటిన్నర టీకాల నీటిని తరలిస్తే) తవ్విన కాల్వలకు ఎత్తిపోయాలి. ఈ ఒక్క లిఫ్టే చాలదు. ఎల్లంపల్లి రిజర్వాయర్‌లోకి ప్రాణహిత కాల్వనీరు చేరాలంటే 73.5 కిలోమీటర్లు (కాల్వ పొడువు) వద్ద 39 మీటర్ల ఎత్తుకు రోజూ 1.7 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ కాల్వను 46 కి.మీటర్ల పొడువు తవ్వినారు. ఫారెస్టు క్లియరెన్స్ కేంద్ర ప్రభుత్వం ఇవ్వలేదు కాల్వ పనులు నిలిచిపోయాయి.ప్రాణహిత నదిపై తుమ్మడిహెట్టి వద్ద ప్రాజెక్టును నిర్మించి తీరుతామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రాజెక్టుకు పైన తెలిపిన అవరోధాలు ఆయన దృష్టికి వచ్చి ఉంటే కేసీఆర్ రీజైనింగ్ ఎం దుకు చేశారో అర్థమవుతుంది.

### కాళేశ్వరం రీ-డిజైనింగ్ ఎందుకవసరమైంది?

కాళేశ్వరం పేరుతో రీ-డిజైనింగ్ చేసిన ప్రాజెక్టు వలన కలిగే ప్రయోజనాలను కూడా కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వ పెద్దలు అర్థం చేసుకోవాలి. తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఐటీసీల నీటి లభ్యత ఉంటే ప్రాణహిత-గోదావరి సంగమం స్థలంలో లభ్యమయ్యే నీరు 284 టీఎంసీలు జరుగుతున్నాయని కేంద్ర జల సంఘం ప్రకటించింది. జాబితాలోని 63 టీఎంసీల నీటిని భవిష్యత్తులో వినియోగంలోకి తెస్తే ఇంకా 221 టీసీల నీరు తెలంగాణలో వినియోగించుకునే అవకాశం ఉంటుంది. అదనంగా ఇక్కడ లభ్యమయ్యే 119 టీఎంసీలలో 72 టీఎంసీలు ఆదిలాబాద్ జిల్లా పరీవాహక ప్రాంతం నుంచే వస్తాయి. తుమ్మడిహెట్టి బ్యారేజీకి దిగువన పెద్దవాగు, నీల్వాయి, వట్టివాగు, చెలిమెల వాగు, గొల్ల వాగు, జైపూర్ వాగు తదితర వాగుల నుంచి ఈ నీరు ప్రాణహిత, గోదావరి నదిలో కలుస్తుంది. రీ-డిజైనింగ్‌లో మూడు బ్యారేజీలు, పంపింగ్ స్టేషన్ల ద్వారా రివర్స్-ఫ్లో చేసే నీరు 36 టీసీలు గోదావరి నదిలో నిల్వ ఉండటం వల్ల మత్స్య సంపద, పరిశ్రమల ఏర్పాటు, టూరిజం అదనపు ప్రయోజనాలు సమకూరనున్నాయి. ఇంత భారీ పరిమాణంలో నీటిని నిల్వ చేయడానికి రిజర్వాయర్లను నిర్మించాల్సి వస్తే సుమారు 5 వేల కోట్లు అవసరమయ్యాయి.తుమ్మడిహెట్టి నుంచి బ్యారేజీ నిర్మాణాన్ని కాళేశ్వరానికి తరలించడం వెనుక ఆత్మహత్యల పాలవుతున్న రైతాంగాన్ని ఆదుకోవాలనే కోణమే తప్ప మంత్రి అపో హ పడుతున్న ఏ రాజకీయ కోణమూ, మరే 'మతలబు' లేదు.

### మల్లన్న సాగర్‌కాళేశ్వరానికి అడ్డు తగిలేది కాంగ్రెస్ నేతలే!

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కాళేశ్వరం ప్రాజెక్టును టీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఆదినుంచీ అడ్డుకున్నది కాంగ్రెస్ పార్టీ నాయకులు. రాష్ట్రంలో, మహారాష్ట్రలో తమ పార్టీ ప్రభుత్వాలే ఉన్నా అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రులు తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణ అనుమతుల కోసం ఎలాంటి ప్రయత్నం చేయలేదు. కానీ, మొబిలైజేషన్ అడ్వాన్సులను కాంట్రాక్టర్లకిచ్చి కమీషన్లు రాబట్టుకున్నారు. మల్లన్నసాగర్‌ను అడ్డుకోడానికి వందలాది కేసులు వేసింది నిర్వాసితుల ముసుగులో కాంగ్రెస్ నాయకులేనని తేలింది.

### బీఆర్ అంబేద్కర్ వార్ధా ప్రాజెక్టు

బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టిన ప్రాణహిత ప్రాజెక్టును కేసీఆర్ వదులుకోలేదు. లేదా రద్దు చేయలేదు. రీ-డిజైనింగ్ చేసేనాటికే (2016) నిర్మించిన కాల్వను ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు గతంలో (50 వేల ఎకరాలు) వినియోగించేందుకు తలంపుతో 148 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణాన్ని ప్రారంభించాలనుకున్నారు.కానీ, ఆ ఎత్తులో ఇప్పటికే తవ్విన కాల్వకు నీటి గ్రావిటీ ద్వారా సాధ్యపడదని, బ్యారేజీ నిర్మాణంపై గంగిరెడ్డులు తెలిపినట్లు అనేక ఇబ్బందులు ఉన్నాయని గ్రహించిన నిపుణుల సూచన మేరకు తుమ్మడిహెట్టికి సుమారు 2 కిలో మీటర్ల మేర వార్ధానదిపై (పెన్' వార్ధా సంగమస్థలానికి సుమారు 20 కిలోమీటర్ల పొడవు) బ్యారేజీని 1551 మీటర్ల ఎత్తులో 2951 మీటర్ల ఎత్తులో (దీనిలో కాంక్రీట్ స్ట్రక్చర్ పొడవు 572 మీటర్లు మాత్రమే)తో నిర్మించాలని డీపీఆర్‌ను రూపొందించి కేంద్ర జల సంఘానికి పంపింది. 'బీఆర్ అంబేద్కర్ వార్ధా ప్రాజెక్ట్' అంచనా వ్యయం రూ.4550.73 కోట్లు (భూ సేకరణ, బ్యారేజీ, కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు, పంప్‌హౌజ్‌లు, సబ్‌స్టేషన్లు మొదలైనవి)తుమ్మడిహెట్టితో పోల్చితే ఈ ప్రాజెక్టుకయ్యే ఖర్చు చాలా తక్కువ. మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 2.94 టీకాలు. ఈ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా (50 క్యూమెక్స్ లేదా 1765 కూసెక్స్) 7.35 కాల్వను, నిర్మించి ప్రాణహిత కాల్వకు (54 ప్రాంతాల మొత్తం పొడవు) కలుపుతారు. వార్ధా నదిలో లభ్యమయ్యే వరద జలాలను పైకాల్వ నుం చి టన్నెల్ ద్వారా జైపూర్ వాగులోకి మళ్లించి సుందిళ్ల రిజర్వాయర్‌కు చేర్చవచ్చు.కాంగ్రెస్ ప్రభుత్వం భేషజాలకు పోయి తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులోనే బ్యారేజీ నిర్మించాలని అనుకుంటే ప్రజలు వారికిచ్చిన పుణ్య(పాలనా)కాలం ముగిసిపోతుందే తప్ప లక్ష్యం నెరవేరే అవకాశం లేదు. ఒకవేళ నిర్మించినా రెండు లిఫ్టులతో ఎత్తిపోయగలిగే నీరు కాళేశ్వరం కింద స్థిరీకరించాల్సిన 18.82 లక్షల ఎకరాల ఆయకట్టుకు, కొత్తగా నీరందించాల్సి ఉన్న 19,63,360 ఎకరాలకు తుమ్మడిహెట్టి వద్ద లభ్యం కాదు. మళ్లీ కాళేశ్వరమే శరణ్యం.

### సమీకృత కాళేశ్వర ప్రాజెక్టు

కాళేశ్వరం ప్రాజెక్టు అంటే 141 టీటీల నీటిని నిల్వజేసే 15 రిజర్వాయర్లు, 3 బ్యారేజీలు, 22 లిఫ్టులు, 21 పంప్‌హౌజ్‌లు, 7 లింకుల్లో 28 ప్యాకేజీలు, 19 సబ్‌స్టేషన్లు, 1,531 కిలోమీటర్ల ప్రవాహ కాల్వలు, 203 కి.మీ.రంగాలు. ప్రెషర్మెన్లు.మేడిగడ్డ బ్యారేజీలోని 8 బ్లాకుల్లో గల 86 పియర్స్‌లో 7వ బ్లాకులోని కేవలం 3 పియర్స్ కుంగినంత మాత్రాన మొత్తం కాళేశ్వరమే పనికిరానిదైందా? ఈ 3 పియర్స్ కుంగడానికి కారణాలను నిపుణుల కమిటీ పరిశోధిస్తుంది. ఎల్ అండ్ టీ కంపెనీ తమ సొంత డబ్బుతో 7వ బ్లాకును మొత్తంగా కానీ, లేదా కుంగిన 3 పియర్స్‌ను కానీ పునర్నిర్మించిందని స్పష్టం చేసింది. ప్రభుత్వం న్యాయవిచారణ జరుపుకోవచ్చు కానీ, ప్రమాదానికి కారణాలను వెలికి తీయగలిగే నిపుణుల కమిటీ మాత్రమే. తక్షణమే దేశంలోని లేదా ఇతర దేశాల్లో నిపుణులను సంప్రదించి కమిటీని నియమించాలి.మంత్రుల బృందం సరస్వతీ (అన్నారం) బ్యారేజీని కూడా అదేరోజు సందర్శించారు. అసహజమైన ప్రమాదమేదీ ఆ బ్యారేజీలో సంభవించలేదని ఇప్పటికే వారికి అర్థమై ఉండవచ్చు. పార్వతి (సుందిళ్ళ) బ్యారేజీతో పాటు ఈ రెండు సురక్షితంగా ఉన్నాయి.

### మూడో టీం అవసరం?

నీటి పారుదల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేవనెత్తిన వస్తువులు స్పష్టత రావాల్సిన అవసరం ఉంది. 'రెండు టీటీలనే పూర్తి స్థాయిలో లిఫ్ట్ చేయనప్పుడు మూడో టీఎంసీ కోసం తొందరేమొచ్చింద'ని మంత్రి ప్రశ్నించారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో ఆలోచించి, తెలంగాణ సాగునీరు, వ్యవసాయ పరిస్థితులపై సమగ్ర అవగాహనతో మూడో టీయం కోసం తాపత్రయ పడ్డారు. నదుల అనుసంధానం కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రయత్నించింది. ఉత్తరప్రదేశ్‌లోని కెన్-బెత్వా నదుల అనుసంధాన ప్రక్రియ మొదలైంది. గోదావరి-కావేరి నదుల అనుసంధాన పనులు మొదలు కాబోతున్నవి. ఇదే జరిగితే తెలంగాణ నికర జలాల్లో తన హక్కులను శాశ్వతంగా కోల్పోతుంది. ఒకవేళ కాళేశ్వరం ద్వారా మూడో టీ నీటిని లిఫ్ట్ చేసి మరో 7 లక్షల ఎకరాలు (చెరువులు, వాగులపై చెక్డ్యాంలు, చిన్న, మధ్యతరహా ఎత్తిపోతల పథకాలు, మీడియం, మైనర్ ప్రాజెక్టుల కింది ఆయకట్టు) స్థిరీకరించాలంటే, కేసీఆర్ మొత్తం 45 లక్షల ఎకరాలకు కాళేశ్వరం నీటిని అందించాలని కోరారు. ఒకసారి ఈ వ్యవస్థను ఏర్పా టుచేసుకుంటే తెలంగాణకు గోదావరి జలాల్లో గల పూర్తి వాటాను (968 టీఎంసీలు) వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుంది. ఈ మంచి ప్రయత్నాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డుకోవడానికి సుప్రీంకోర్టులో స్టేటస్‌కో ఆర్డర్ తీసుకోగా రాష్ట్ర ప్రభుత్వం సరైన రీతిలో వాదనలు వినిపించి 'స్టే'ను రద్దు చేసింది.

### అధిక వ్యయంతో కాళేశ్వరం సాగు?

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోసే నీటి కోసం కరెంటుపై వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రభుత్వం మోయాల్సి వస్తోందని మరో వాదనను ఎంతోకాలంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు తెస్తోంది.తుమ్మడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో నీటిని లిఫ్ట్ చేస్తే అవసరమయ్యే ఖర్చు కూడా తక్కువేమీ కాదు. వాటికీ తేడా ఒక్క లిఫ్టు మాత్రమే. కాళేశ్వరంలో 3 బ్యారేజీల వద్ద 3 లిఫ్టులుంటే తుమ్మిడిహెట్టి నీటిని రెండు లిఫ్టుల ద్వారా ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు ఎత్తిపోస్తారు.కాళేశ్వరం ద్వారా సాగులోకి వచ్చే కొత్త ఆయకట్టుకు గానీ, స్థిరీకరించే ఆయకట్టుకు గానీ పక్కన గోదావరి, కడెం, మంజీరా నదుల నీరు రాని కరువు పరిస్థితుల్లోనే కాళేశ్వరం నుంచి మూడు దశల్లో నీటిని లిఫ్ట్ చేస్తారు. పంట కాలం మొత్తం అన్ని లిఫ్టులు 24 గంటలు పనిచేయాల్సిన అవసరం ఉండదు. ఇది 'స్టాప్ గ్యాప్' ఏర్పాటుగా భావించాలి.కాళేశ్వరం ఆయకట్టు (స్థిరీకరణతో కలిపి)లో లక్షలాది బోర్లు, బావులు ఉంటాయి. కాల్వల ద్వారా సాగునీరందుతున్నప్పుడు వీటి అవసరం ఉండదు. ఆ మేరకు కరెంటు ఆదా అవుతుంది.'నాన్-పీక్ అవర్స్'లో ఉత్పత్తి అవుతున్న విద్యుత్తును లిఫ్టులకు వినియోగించడం ద్వారా విద్యుత్తు వృథాను నివారించవచ్చు, రిజర్వాయర్లు నింపవచ్చు.ప్రవాహ కాల్వల ద్వారా నీరు లభించే అవకాశం లేనప్పుడు తెలంగాణకు ఎత్తిపోతలు తప్ప మరో దారి లేనే లేదు.

### బహుళ ప్రయోజనకారి కాళేశ్వరం

కాళేశ్వరం జలాలన్నీ కేవలం వ్యవసాయానికి మాత్రమే పరిమితం కావు. అపారమైన నీటి నిల్వలతో ఉండే వందకుపైగా ఉండే గోదావరి నదిలో, రిజర్వాయర్లలో, చెరువులలో, వాగులపై భారీ చెక్‌డ్యాంలలో, విశాలమైన ప్రధాన కాల్వలలో వేల కోట్ల ఆదాయాన్నిచ్చే మత్స్య సంపదను సృష్టించడం అసాధ్యమే కాదు.మంచినీటి చేపలకు, రొయ్యలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉన్నది. గతం కన్నా మత్స్యకారుల ఆదాయం తెలంగాణలో వంద రెట్లు ఇప్పటికే పెరిగింది. సుమారు 3,500 చెరువులకు కాళేశ్వరం జలాలను మళ్లిస్తు న్నాం. కాళేశ్వరం జలాలతో పారిశ్రామికాభివృద్ధికి అవకాశం ఉంది. 1944లోనే నిజాం గోదావరిపై బహుళార్థ సాధక ప్రాజెక్టును నిర్మించి తీరప్రాంత పారిశ్రామిక వాడలను నెలకొల్పాలని ప్రణాళికలు తయారుచేయడం. అవి అమలుకాలేదు. ఇప్పుడు వాటి అమలుకు అవకాశం ఏర్పడింది. గోదావరి బ్యారేజీల వద్ద, రిజర్వాయర్లలో నిల్వ ఉంటే నీటిలో టూరిజం పరిశ్రమను అభివృద్ధి చేయవచ్చు.ఈ ఆదాయ మార్గాలపై, వాటి అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిపెట్టాలే తప్ప పనికిమాలిన సాకులతో కాళేశ్వర ప్రాజెక్టుపై, కేసీఆర్‌పై విషం చిమ్మడం ద్వారా సాధించేదేమీ లేకపోగా ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

## దక్షిణ కొరియాలో ప్రతిపక్ష పార్టీ అధినేతపై కత్తితో దాడి

సియోల్: సియోల్ దక్షిణ కొరియా ప్రధాన ప్రతిపక్షం డెమోక్రెటిక్ పార్టీ అధినేత లీ జే-మియుంగ్‌పై మంగళవారం హత్యాయత్నం జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఆయన మెడపై అకస్మాత్తుగా కత్తితో పొడిచాడు. బూసాన్ నగరంలో విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి స్థల పరిశీలనకు లీ వెళ్లిన సందర్భంగా ఈ దారుణం జరిగింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందనేది ఇంకా తెలియలేదు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.స్థానిక మీడియా కథనాల ప్రకారం, లీపై దాడికి నిందితుడికి సుమారు 60 ఏళ్లు ఉన్నాయి. ఎయిర్‌పోర్ట్ స్థల పరిశీలనకు వచ్చిన లీజే మియుంగ్‌ను ఆటోగ్రాఫ్ కోసం సమీపించిన నిందితుడు ఆ తరువాత ఒక్కసారిగా దాడికి తెగబడ్డాడు. చేతిలో కత్తితో లీ మెడలో పొడిచాడు. అయితే, పక్కనున్న ఇతరుల నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దాడితో కుప్పకూలిపోయిన లీని వెంటనే ఆసుపత్రికి చేరుకుంది. కాగా, 2022లో జరిగిన ఎన్నికలలో లీ



స్వల్ప తేడాతో ఓడిపోగా సుక్ యిలోల్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దక్షిణకొరియాలో ఇలాంటి రాజకీయదాడులు గతంలోనూ అనేకం జరిగాయి.

# పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్‌లను ఓడించాలి



సిద్దిపేట,వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు గుణపాఠం చెప్పాలని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రయోజనాలు బీజేపీ, కాంగ్రెస్‌కు పట్టవని అన్నారు. కేసీఆర్‌కు రైతుల మీద ఉన్న ప్రేమ కాంగ్రెస్‌కి ఉందా అని నిలదీశారు. 4 వేల ఫించన్ ఇస్తామన్నారు.. ఇచ్చారా అని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 9వ తేదీన 2 లక్షలు రుణమాఫీ అని చెప్పి ఇప్పుడు మాట తప్పారన్నారు. 6 కాంగ్రెస్ గ్యారెంటీలపై ప్రశ్నిస్తుంటే తనకు తొందరెక్కువ అని అంటున్నారు..కాంగ్రెస్ నేతలు ఏం చెప్పారో అదే తాను గుర్తుచేస్తున్నానని ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. మంగళవారం నాడు దుబ్బాకలో బీఆర్ఎస్ కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సభలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్‌రావు మాట్లాడుతూ... ప్రభుత్వం రాలేదని నిరాశ పడవద్దని మనకు ఇది ఒక స్పీడ్ బ్రేకర్ లాంటిదేనని చెప్పారు. తెలంగాణకు బీఆర్ఎస్ శ్రీరామ రక్ష లాంటిదన్నారు. మనం ఎన్నో విజయాలు, అపజయాలు చూశాం.. మనకు పూల బాట తెలుసు, ముళ్ల బాట తెలుసునని అన్నారు. బీఆర్ఎస్ లేకుంటే తెలంగాణనే లేదన్నారు. కాంగ్రెస్ నేతలు అధికారంలోకి రావడానికి ఒకటి కాదు రెండు కాదు.. 412 హామీలు ఇచ్చారని మండిపడ్డారు. కరెంట్ బిల్లు కట్టవద్దని తాము అధికారంలోకి రాగానే 200 యూనిట్లు ఫ్రీ అని కాంగ్రెస్ నేతలు చెప్పారన్నారు. ఇప్పుడు మాత్రం ముక్కుపిండి మరీ కరెంట్ బిల్లులు వసూలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తాము రాగానే రైతు బంధు 15000 ఇస్తామన్నారు.. ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రజలతో కలిసి మెలిసి ఉందాం.. తెలిసో తెలియకో ఏమైనా పొరపాట్లు జరిగి ఉంటే సరిదిద్దుకుందామన్నారు. భవిష్యత్తు మనదే.. కార్యకర్తలు అధైర్య పడద్దని చెప్పారు. ఏడాది తర్వాత ఖచ్చితంగా ప్రజలు మళ్లీ మనల్నే ఆదరిస్తారని.. ఇప్పటికే ప్రజల్లో ఆలోచన మొదలైందన్నారు. రెండు జాతీయ పార్టీలకు కేంద్రంలో అధికారం కావాలి తప్ప, తెలంగాణ ప్రయోజనాలు పట్టవని మండిపడ్డారు. తెలంగాణ రాగానే లోయర్ సీలేర్ పవర్ ప్రాజెక్టు ఉన్న ఏడు మండలాలను బీజేపీ ఆంధ్రలో కలిపిందని.. దానికి కాంగ్రెస్ మద్దతును ఇచ్చిందని ధ్వజమెత్తారు. ఆ రోజు రాజ్యసభలో కాంగ్రెస్ మద్దతు ఇవ్వకపోతే ఆ ఏడు మండలాలు ఆంధ్రలో కలిసేవి కాదని చెప్పారు. తెలంగాణ ప్రయోజనాలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు పట్టవన్నారు. రాష్ట్ర హక్కుల కోసం పోరడాలంటే అది బీఆర్ఎస్‌కే సాధ్యమన్నారు. బీజేపీ అడుగులకు మడుగులు వత్తే పార్టీ కాంగ్రెస్ అని హేలన చేశారు. రేపు పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడగాలంటే ఇచ్చిన హామీలు కాంగ్రెస్ నెరవేర్చాలన్నారు. ఇచ్చిన మాట తప్పిన కాంగ్రెస్ వైఖరిని ప్రజల్లో చర్చకు పెట్టాలని ఎమ్మెల్యే హరీష్‌రావు పేర్కొన్నారు.

# ఎన్టీఆర్ నినాదంతో మరోమారు ప్రజల్లోకి



అమరావతి,పార్టీ ఆవిర్భావం సందర్భంగా ఎన్టీఆర్ ఇచ్చిన రా కదలిరా పిలుపునే మళ్లీ ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వెల్లడించారు. స్వర్ణయుగం తెలుగుదేశంతోనే సాధ్యమనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నాం. అని ఆయన మీడియాతో అన్నారు. విధ్వంసాలు, వైఫల్యాలు తప్ప జగన్ పాలనలో అభివృద్ధి అనేది భూతద్దంలో వెతికినా కనిపించదని విమర్శించారు. రాష్ట్రాన్ని చీకటిమయం చేసి ఆంధ్రప్రదేశ్ ని ఆందోళనప్రదేశ్ గా మార్చిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని దుయ్యబట్టారు. 'అన్ని సభలు తెలుగుదేశం- జనసేన సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతాయి. చంద్రబాబు- పవన్ కళ్యాణ్ కలిసి పాల్గనే సభలు త్వరలోనే ప్రకటిస్తాం అన్నారు. పార్లమెంట్ స్థాయి బహిరంగ సభలతో సంబంధం లేకుండా మేనిఫెస్టో ప్రకటన సభను ప్రత్యేకంగా నిర్వహిస్తాం.. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చేందుకు ఎంతోమంది సంప్రదిస్తున్నారని తెలిపారు. కొత్త, పాత వారి సమన్వయం కోసం ఓ కమిటీ ఇప్పటికే పని చేస్తోంది. వైసీపీ నుంచి వచ్చే వారి పట్ల ఆచితూచి వ్యవహరిస్తామని అచ్చెన్నాయుడు అన్నారు. జగన్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లటమే లక్ష్యంగా రేపటి నుంచి 'రా కదలి రా!' పేరిట తెలుగుదేశం కార్యక్రమాలు నిర్వహించబోతోంది.. తెలుగుదేశం- జనసేన ఎన్నికల గుర్తులతో సరికొత్త లోగో ఆవిష్కరించారు.. సైకిల్ -గాజు గ్లాసుతో కూడిన లోగోను అచ్చెన్నాయుడు ఆవిష్కరించారు. అనంతరం పంచాయితీల సమస్యలపై రేపు సర్పంచులతో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. బీసీలకు జరిగిన అన్యాయంపై 4వ తేదీన జయహో బీసీ పేరిట రాష్ట్ర స్థాయి సదస్సుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు.. 5వ తేదీ నుంచి 29 వరకూ అన్ని 22 పార్లమెంట్ స్థానాల్లో చంద్రబాబు బహిరంగ సభలు నిర్వహిస్తారు.. 5న ఒంగోలు, 6న విజయవాడ, నరసాపురం పార్లమెంట్ పరిధిలో సభలు, 18న ఎన్టీర్ వర్ధంతి సందర్భంగా గుడివాడలో భారీ బహిరంగసభ ఏర్పాట్లలో పార్టీ నేతలు మునిగిపోయారు. ఇలాతెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టుంది. 'రా... కదలిరా' పిలుపుతో 5 నుంచి జనంలోకి చంద్రబాబు వెళ్లనున్నారు. 5 నుంచి 29 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 22 పార్లమెంట్ల పరిధిలో భారీ బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. టిడీపీ-జనసేన సంయక్తంగా నిర్వహించే ఈ సభలకు చంద్రబాబుతో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హాజరవుతారు. టీడీపీ జనవరి నెల ఎన్నికల ప్రచార షెడ్యూల్ ను ఏపీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రకటించారు. 4వ తేదీన పార్టీ జాతీయ కార్యాలయంలో చంద్రబాబు చేతులమీదుగా 'జయహో బీసీ' ప్రారంభం అవుతుంది. బీసీల్ని ఈ ప్రభుత్వం, జగన్ రెడ్డి ఎంత దారుణంగా వంచించారో, ఎంతగా వారిపై దమనకాండ సాగిస్తున్నారో ప్రతి బీసీ కుటుంబానికి తెలియచేసి బలహీనవర్గాల్లో చైతన్యమే లక్ష్యంగా టీడీపీ కార్యక్రమం నిర్వహిస్తోంది. టీ.ఎన్.టీ.యూ.సీ విభాగం ఆధ్వర్యంలోకార్మికుల్లో చైతన్యం తీసుకురావడమే ధ్యేయంగా త్వరలో రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర చేయనున్నారు. 6 నెలల నుంచీ విధ్వంసకర పాలన సాగిస్తున్న జగన్ రెడ్డి అవినీతిపరులు, అసమర్థులు, నేరస్తుల్ని పెంచి పోషిస్తున్నాడని, వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎటు చూసినా విధ్వంసాలు, విద్వేషాలు, వైఫల్యాలు తప్ప, భూతద్దంలో వెతికినా కూడా ఎక్కడా ఒక మంచిపని కానీ, విజయం కానీ కనిపించవని, భస్మాసురుడి లా జగన్ రెడ్డి మొత్తం రాష్ట్రాన్ని విధ్వంసం చేశాడని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజ రాపు అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా చైతన్యమే లక్ష్యంగా రాబోయే 100 రోజుల్లో నిర్విరామంగా టీడీపీ కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. 100రోజుల్లో రాష్ట్రంలో ఎన్నికలు రానున్నాయి. చివరిదశకు చేరిన జగన్ రెడ్డి దుర్మార్గపు పాలనకు ముగింపు పలకడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఈ 100రోజుల్లో ఈ ప్రభుత్వం, జగన్ రెడ్డి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిలో చైతన్యం తీసుకురావడానికి టీడీపీ నిర్విరామంగా కార్యక్రమాలు చేపట్టనుంది. టీడీపీ చేపట్టబోయే కార్యక్రమాల్లో ముందుగా మంగళగిరి లోని పార్టీ జాతీయ కార్యాలయం సమీపంలోని కన్వెన్షన్ సెంటర్లో పంచాయతీ రాజ్ వర్క్ షాపు నిర్వహించబోతున్నా. రాష్ట్రంలోని అన్ని గ్రామాల పంచాయతీ సర్పంచ్ లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు ఆహ్వానం పంపించాం. వారందరి సమక్షంలో ఈ ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను ఏవిధంగా నిర్వీర్యం చేసిందో, జగన్ రెడ్డి ఏ విధంగా ప్లలెల్ని నాశనంచేస్తాడో తెలియచేస్తాం. తాము చెప్పే అంశాలను స్థానిక ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రజలకు తెలియచే స్తే, ఈ ప్రభుత్వానికి కాలం చెల్లినట్టే. అలానే టీడీపీ ప్రభుత్వ రాగానే పంచాయతీల బలోపేతానికి, పునర్వైభవానికి ఎలాంటి చర్యలు తీసుకుంటామో, ఏ విధమైన కార్యాచరణ అమలుచేస్తామో కూడా ఈ వర్క్ షాపులో తెలియచేస్తామని అచ్చెన్నాయుడు తెలిపారు. జగన్‌రెడ్డి తన పాలనలో బీసీలను దారుణంగా వంచించాడని అచ్చెన్నాయుడు ఆరోపించారు. వారిపై తప్పుడు కేసులు పెట్టి, చిత్రహింసలకు గురిచేయించాడు. తన దుర్మార్గాలు ప్రశ్నించిన బీసీలను దారుణంగా చంపించా డు. 4 సంవత్సరాల 7 నెలలుగా ఈ ముఖ్యమంత్రి బీసీలపై దమనకాండ సాగిస్తున్నాడు. బీసీలుగా పుట్టడమే తప్పు అన్నట్టు వారిపై తన పైశాచికత్వం ప్రదర్శిస్తున్నాడు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లకు 10శాతం కోత పెట్టాడు. 16వేలకు పైగా పదవుల్ని బీసీలకు దక్కకుండా చేశాడు. ఉత్తుత్తి కార్పొ రేషన్లు పెట్టి బీసీలను ఉద్ధరిస్తున్నట్టు కల్లబొల్లి మాటలు చెబుతున్నాడని మండిపడ్డారు. బీసీ మంత్రుల్ని ఉత్సవవిగ్రహాల కంటే దారుణంగా తయారు చేశాడు. ఇవన్నీ అందరికీ అర్థమయ్యేలా తెలియచేయడానికి టీడీపీ ఆధ్వర్యంలో 'జయహో బీసీ' కార్యక్రమాన్ని 4వ తేదీన మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రారంభించ బోతున్నారు. 4వ తేదీ నుంచి ప్రతి నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో కార్యక్రమం జరుగుతుంది. అలానే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి బీసీ ఇంటి తలుపు తట్టేలా 'జయహో బీసీ' దిగ్విజయంగా కొనసాగు తుందని తెలిపారు. ఏపీ ఒక నూతన నవోదయం చూసేందుకు టీడీపీ-జనసేన పార్టీలు కలిసి ముందుకు సాగుతున్నాయి. రెండుపార్టీల కలయి కను, అవి నిర్వహించే కార్యక్రమాలను ప్రజలు అమితంగా ఆదరిస్తున్నారని అచ్చెన్నాయుడు తెలిపారు. తెలుగుదేశంలో చేరడానికి చాలామంది అధికారపార్టీ నేతలు సిద్ధంగా ఉన్నారు. కానీ తామే ఆచితూచి వ్యవహరిస్తున్నాం. పార్టీలో చేరికలకు సంబంధించి రెండు కమిటీలు వేశాం. కమిటీల అభిప్రాయాలు, అధినాయకుడి నిర్ణయమే అంతిమం. పార్టీ నేతలతో సంప్రదించాకే కొత్తవారి చేరికపై స్పష్టమైన నిర్ణయానికి వస్తాం. ఒక వారంలో తెలుగుదేశంలో చేరేఇతర పార్టీలనేతలపై ఒక స్పష్టత వస్తుంది. సొంత పార్టీ నాయకులకే ఈ ముఖ్య మంత్రిపై విశ్వాసం లేదు. ఈ రోజో, రేపో తనపార్టీ అభ్యర్థుల జాబితా విడుదల చేస్తున్నానన్నాడు.. మరలా పిల్లిలా వెనకడుగు వేశాడని ఎద్దేవా చేశారు. టీ.ఎన్.టీ.యూ.సీ విభాగం తర్వలోనే బస్సుయాత్ర చేపట్టనుంది. దానికి సంబంధించిన పోస్టర్ ను ఇప్పుడు ఆవిష్కరిస్తున్నాం. టీ.ఎన్.టీ.యూ.సీ నేతలు అన్నిరంగాల కార్మికులతో మాట్లాడి, టీడీపీ ప్రభుత్వంలో కార్మికులకు జరిగిన మేలు..ఈ ప్రభుత్వం, ఈ ముఖ్యమంత్రి చేసిన మోసాల్ని వివరిస్తారు.' అని అచ్చెన్నాయుడు తెలిపారు.

# గౌడసంఘం అభివృద్ధికి కృషి చేస్తా: ఎమ్మెల్యే వివేక్



చెన్నూర్,గౌడ కులస్తుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించి తనవంతు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం గౌడ సంఘం అధ్వర్యంలో గోదావరి తీరాన కొలువుదీరిన రేణుక ఎల్లమ్మకు మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివేక్ వెంకటస్వామి హాజరై ప్రత్యేకపూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఎన్నికల నామినేషన్ దాఖలు అనంతరం దర్శించుకున్న మొట్టమొదటి ఆలయం రేణుక ఎల్లమ్మ తల్లి అని, ఆమె ఆశీర్వాదంతో భారీ మెజారిటీతో ప్రజలు గెలిపించారని గుర్తు చేశారు. ఎన్నికల వాగ్దానంలో భాగంగా గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, గౌడ సంఘం అధ్యక్షులు కుర్మ అశోక్ గౌడ్, నాయకులు జక్కుల సత్య నారాయణ, కుర్మ సత్యనారాయణ, లక్ష్మి రాజా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# పురాతన మండపాలకు జీర్ణోద్ధరణ



తిరుమల,పురాతన మండపాలు శిథిలావస్థకు చేరుకుంటే మరమ్మతులు చెయొచ్చని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కూలిపోయే పరిస్థితి ఉంటే జీర్ణోద్దరణ చెయ్యడంతో పాటు భక్తులకు అనువుగా మార్పులు చేయొచ్చన్నారు. దేశంలో చాలా ఆలయాల నిర్మాణాలు టీటీడీలో వేద విద్య అభ్యసించిన విద్యార్థుల సూచన మేరకు నిర్మిస్తున్నారని తెలిపారు. అలాంటిది టీటీడీలో పురాతన మండపాల శిథిలావస్థకు చేరుకుంటే మరమ్మతులు చెయ్యకూడదా అని ప్రశ్నించారు. అలిపిరి పాదాల మండపం వద్ద శిథిలావస్థకు చేరుకున్న మండపం పునర్నిర్మాణం కోసం ఆర్కియాలజీ అఫ్ ఇండియాకు ఇప్పటికే పలుమార్లు లేఖలు రాశామన్నారు. కడప జిల్లా సోమనాథ స్వామి ఆలయంలో గోడ కూలితే మరమ్మత్తుల కోసం ఆర్కాలజీ అఫ్ ఇండియాకు లేఖ రాసినప్పటికీ స్పందన లేదన్నారు. కొందరు రాజకీయ దురుద్దేశంతో గందరగోళం సృష్టించడం వల్ల అలిపిరి వద్ద మండపం పునర్నిర్మాణం ఆగిందని టీటీడీ ఈవో వెల్లడించారు. శేషాచల అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల ద్వారా జంతు కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నామని తెలిపారు. త్వరలోనే రూ.3.5 కోట్లతో ఆధునాతన కెమెరాలను కొనుగోలు చేస్తున్నామన్నారు. ఈ కెమెరాల ఏర్పాటుతో జంతు కదలికలను వెంటనే గుర్తించవచ్చని టీటీడీ ఈవో ధర్మారెడ్డి పేర్కొన్నారు. ఇదిలావుంటే వైకుంఠ ఏకాదశిని పురస్కరించు కుని డిసెంబర్ 23 నుంచి పది రోజుల పాటు వైకుంఠ ద్వారాలను టీటీడీ తెరిచే ఉంచింది. వైకుంఠ ద్వారం గుండా గత పది రోజులుగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. పదిరోజుల్లో వైకుంఠ ద్వారాల గుండా స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య, హుండీ ఆదాయ వివరాలను టీటీడీ ఈవో ధర్మారెడ్డి మీడియాకు వెల్లడించారు. శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారాలు తెరిచిన 10 రోజుల్లో దాదాపు 6లక్షల 47వేల 452 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని ఈవో తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా 40వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారన్నారు. అలాగే శ్రీవారి హుండీ ద్వారా రూ.40.10 కోట్లు ఆదాయం లభించిందని చెప్పారు. 17.81 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారని.. 35.60 లక్షల లడ్డులను భక్తులకు విక్రయించినట్లు తెలిపారు. 2లక్షల 13వేల మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారని టీటీడీ ఈవో ధర్మారెడ్డి వెల్లడించారు.

# వైసిపికి దాడి వీరభద్రరావు రాజీనామా



విశాఖపట్టణం,ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది.. కీలక నేత దాడి వీరభద్రరావు రాజీనామా చేశారు. విశాఖపట్నం నగరానికి చెందిన ఉత్తరాంధ్ర కీలక నేత దాడి వీరభద్రరావు పార్టీకి రాజీనామా చేశారు. అనకాపల్లి టికెట్ ఆశించిన ఆయనకు నిరాశ ఎదురవడంతో.. పార్టీని వీడారు. తన రాజీనామా లేఖను సీఎం జగన్‌కు పంపించారు. తనకు టికెట్ రానందుకే దాడి విరభద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి దాడివీరభద్రరావు అనకాపల్లి టికెట్‌ను ఆశించారు. అయితే టికెట్ దక్కే అవకాశం లేకపోవడంతో పార్టీ మారాలని భావించారు. ఈ క్రమంలో తన కార్యకర్తలతో అనకాపల్లిలో కీలక సమావేశం నిర్వహించారు. తన నిర్ణయంపై కార్యకర్తలతో చర్చించారు. పార్టీలో తనకు గుర్తింపు లేదని వీరభద్రరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తంతో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే వైసీపీకి రాజీనామా చేశారు. తన రాజీనామా కాపీని సజ్జల రామకృష్ణా రెడ్డి, విజయసాయి రెడ్డికి పంపారు. తాను, తన అనుచరులతో కలిసి పార్టీ వీడుతున్నట్టు మాజీమంత్రి దాడి ఏకవాక్యంతో రాజీనామా లేఖను ముగించారు. కాగా.. దాడివీరభద్రరావు రాజీనామాపై వైవీ సుబ్బారెడ్డి స్పందించారు. ఎన్నికల వేళ అందరూ సీట్లు, టికెట్లు ఆశించడం సహజమన్నారు. అందరినీ సంతృప్తిపరచడం ఏ పార్టీకి కూడా సాధ్యం కాదని వైవీ సుబ్బారెడ్డి అభిప్రాయపడ్డారు. సర్దుబాట్లు అనంతరం ప్రాధాన్యత ఉంటుందని చెప్పామన్నారు. మరో విధంగా ప్రాధాన్యత కల్పిస్తామని వీరభద్రరావుకు చెప్పామని.. అయినా వినలేదంటూ పేర్కొన్నారు. దాడి రాజీనామాతో పార్టీకి నష్టం లేదంటూ వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. దాడి వీరభద్రరావు.. ఎన్టీఆర్ పిలుపుతో 1985లో మొదటిసారి రాజకీయ అరంగేట్రం చేసి అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత 1989, 1994, 1999లలో వరుసగా ఎమ్మెల్యేగా గెలిచారు. నాలుగుసార్లు గెలిచి పలు కీలక శాఖలకు మంత్రిగా పనిచేశారు. 2007 నుంచి 2012 దాకా ఎమ్మెల్సీగా కూడా పనిచేశారు. 2014 ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీని వీడి వైసీపీలో చేరారు. ఆ ఎన్నికలలో వైసీపీ ఓటమి చెందడంతో దాడి కుటుంబం రాజీనామా చేసి బయటకు వచ్చింది.. మళ్లీ 2019 ఎన్నికల ముందు తిరిగి వైసీపీలో చేరిన దాడి వీరభద్రరావు.. మంత్రి గుడివాడ అమర్నాథ్ అనకాపల్లి ఎమ్మెల్యేగా గెలిపించేందుకు కృషి చేశారు.

# నిర్వీర్యం చేస్తున్న సమాంతర వ్యవస్థ

విజయవాడ, గ్రామాల్లో ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు ఉన్నప్పటికి సమాంతర వ్యవస్థను నడపడం వల్ల గ్రామాల రూపురేఖలు మారడం లేదు. గతంలో జన్మభూమి కమిటీలను విమర్శించి న జగన్ ..తాను అధికారం చేపట్టాక వలంటీర్లను పెట్టి సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చారు. వైకాపా ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న వలంటీర్ వ్యవస్థ సర్పంచ్‌ల బాధ్యతలను విస్మరించేలా చేయడమే గాకుండా..గ్రామాల్లో వారి అజమాయిషీ లేకుండా చేసింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేలా చర్యలకు ఉపక్రమించడం లేదు. గ్రామాలకు ముఖ్యంగా సర్పంచ్‌లకు విధులు,నిధులు ఇస్తేనే ఇది సాధ్యమని గుర్తించాలి. గ్రామాలను యూనిట్‌గా చేసి కార్యక్రమాలను రూపొందించుకునే వెసలుబాటు సర్పంచ్‌లకు ఉండాలి. అప్పుడే పన్నుల వసూళ్లు మొదలు కార్యక్రమాల అమలు వరకు వారికి స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా ఉంటుంది. పనులు చేయని సర్పంచ్‌లను చట్టబద్దంగా శిక్షించేలా చట్టం రూపొందించారు. అలాగే కేంద్రం అమలు చేస్తున్న ఉపాధి హామీలో పారిశుద్ధ్య పనులు చేర్చడంతో గ్రామ పంచాయతీలకు ఆర్థిక భారం తప్పుతుంది. గ్రామాల పరిధిలో అన్నీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జరిగేలా చట్టసవరణ జరగాలి. గ్రామాల్లో జరిగే ప్రతి పని పంచాయితీల ఆధ్వర్యంలో జరిగేలా, దాని పరిధిలోనే అధికారులు పనిచేసేలా చూడాలి. అప్పుడే గ్రామాలు ఆర్థికంగా బలపడడంతో పాటు కార్యక్రమాలు ముందుకు సాగుతాయి. గ్రామాలు స్వయం సమృద్ధి సాధిస్తాయి. ఇకపోతే పారిశుద్ధ్య పనుల్లో ఉపాధి కూలీల ఏర్పాటుతో పంచాయతీలకు ఆర్థికభారం తగ్గుతుంది. పంచాయతీలకు వచ్చే నిధులు, ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి వినియోగించుకోవచ్చని నిపుణులు అంటున్నారు. ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న నిర్ణయంతోనే గ్రామాల్లో పారిశుద్యం వెల్లివిరియనుంది. ఈ పథకంలో ఇప్పటి వరకు చేస్తున్న పనుల్లో గ్రామీణ పారిశుధ్యాన్ని జోడించడం ద్వారా గ్రామాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాలి. ఉపాధి హామీ పనుల్ని విస్తృతం చేయాలని, అందులో భాగంగా పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులను ఉపాధి కూలీలతో నిర్వహించడంపై నిర్ణయం తీసుకోవాలి.కేంద్రం ఇందుకు ముందుకు రావాలి. ఫలితంగా ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితుల్లో మార్పు రానుంది. వాస్తవానికి పంచాయతీలకు లభించే సాధారణ నిధుల నుంచి 30 శాతం వరకు పారిశుద్యానికి ఖర్చు చేయాలనే నిబంధన గతంలో ఉండేది. తర్వాత దాన్ని 50 శాతానికి పెంచారు. అంటే పంచాయతీకి వస్తున్న ఆదాయంలో సగం పారిశుద్యానికే వెచ్చిస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగడంలేదు. అధికారులు తాజాగా తీసుకున్న నిర్ణయంతో పంచాయతీలు బలోపేతం కావడంతోపాటు వాటికి ఆర్థిక భారం కూడా తప్పుతుంది. కొత్తగా ఉపాధి కూలీలను పారిశుద్ధ్య పనుల్లోకి తీసుకుంటే గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త నిల్వలను తరలించే వీలుంటుంది. పారిశుద్ధ్య పనుల్లో ఉపాధి కూలీలను వినియోగించుకోవడం సహా అనేక విషయాల్లో రాష్ట్రాలతో ప్రభుత్వం చర్చించాలి. ఈ నిర్ణయంతో అటు కూలీలకు పని దొరకడంతో పాటు పల్లెలు పరిశుభ్రంగా మారే అవకాశం ఉంది. గ్రామాల పరిధిలో కూలీలకు ఏం పని చూపించాలని భావిస్తున్న ఉపాధి సిబ్బందికి అధికారుల నిర్ణయం ఊరటనిస్తోంది. కూలీలకు పల్లెల్లోనే పారిశుద్ధ్య పనులు చూపించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత, భూములు చదును చేయడం, నీటి తొట్లు, పొలాల్లో కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణం తదితర పనుల ద్వారా ఉపాధి కూలీలకు పనులు కల్పించ వచ్చని పేర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకంలో పారిశుద్ధ్య పనులు చేయించాలనే ఆలోచన మంచి నిర్ణయమని సర్పంచులు సైతం అంగీకరిస్తున్నారు. పంచాయతీలకు ఆర్థిక భారం తప్పుతుంది. పంచాయతీ పారిశుద్ధ్య పనులనూ పథకం పరిధిలోకి తీసుకొచ్చేందుకు అధికారులు నిర్ణయం తీసుకోవడంతో కూలీలకు వంద రోజులు సమృద్ధిగా పనులు కల్పించవచ్చని ఉపాధి సిబ్బంది చెబుతున్నారు.

## ప్రజలకు నితరంతరం అందుబాటులో ఉంటా

సిద్దిపేట, పార్టీ అధికారంలో లేకపోయినా ప్రజల వసరాలు తీర్చేలా పని చేస్తానని దుబ్బాక బీఆర్ఎస్ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపసారు. మంగళవారం నాడు దుబ్బాకలో బీఆర్ఎస్ కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సభలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... 54 వేల మెజార్టీతో తనను గెలిపించి తన మీద చాలా బాధ్యత పెట్టారని చెప్పారు. గతంలో అధికారంలో లేకపోయినా హరీశ్‌రావు సిద్దిపేట అభివృద్ధి చేశారని.. అలాగే తాము ఇద్దరం జొడెద్దుల్లా పని చేసి దుబ్బాక, సిద్దిపేటను అభివృద్ధి చేస్తామని చెప్పారు. హరీశ్‌రావును మాజీ మంత్రి అని అనను.. మళ్లీ తాజా మంత్రి అవుతాడన్నారు. ఇది ఎన్నికల సంవత్సరం.. కార్యకర్తలు నిరాశ పడాల్సిన అవసరం లేదని కష్టపడి పార్లమెంట్ ఎన్నికల్లో పని చేద్దామని తెలిపారు. లోకల్ బాడీ ఎన్నికల్లోనూ అందరం కలిసి పని చేసి గెలిపించుకుందామని తెలిపారు. వచ్చేది మన ప్రభుత్వమేనని కార్యకర్తలు అధైర్యపడొద్దని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి భరోసా కల్పించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com